


నాగార్జున సాగర్ జలాశయం



బ్రాడీపేట ఓంకార క్షేత్రంలో యువతి పూజలు..





గుంటూరులోని అరండల్‌పేట శివాలయంలో జరిగిన పూజలలో పాల్గొని దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఆలయాల్లో కార్తీక శోభ

కార్తీకమాస తొలి సోమవారం సందర్భంగా శివాలయాలలో శివ నామ స్మరణలు మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల వద్దకు వెళ్లి, పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకమాస దీపాలు వెలిగించి, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని సందర్శించుకొని మొక్కులు చెల్లించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో కార్తీకమాస శోభ సంతరించుకుంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు పలువురు ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, అధికారులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ఏ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. - గుంటూరు

నిండుకుండలా..

- పూర్తి నీటి నిల్వతో జలాశయాలు కళకళ
- నాగార్జున సాగర్‌లో 306 టీఎంసీలు
- పులిచింతలలో 45.1 టీఎంసీలు
- ఇంకా కొనసాగుతున్న నీటి ప్రవాహం
- 11 లక్షల ఎకరాలకు సాగు నీరు
- వచ్చే ఏడాది కూడా నీటికి ఢోకా ఉండదని అంచనా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) సాగర్ ఆయకట్టులో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. నాగార్జున సాగర్ జలాశయానికి కృష్ణమ్మ పోటెత్తింది. రికార్డు స్థాయిలో 5.60 లక్ష ల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. జూలై మాసం చివరిలో జలాశయానికి ప్రారంభమైన వరద ప్రవాహం నేటికి కొనసాగుతూనే ఉంది. గతంలో నీటి నిల్వలు పరిశీలిస్తే నవంబరు నెలలో రికార్డు స్థాయిలో సాగర్‌లో నీటి నిల్వ ఉండటం విశేషం. నాగార్జున సాగర్.. దిగువన ఉన్న పులిచింతల జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. సాగర్ కుడి కాలువ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాల్వ ఆయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. వచ్చే ఏడాదికి కూడా సాగు నీరుకు ఢోకా ఉండదని అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా.

నాగార్జునసాగర్ జలాశయంలో 98 శాతం మేర నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సోమవారం డ్యాంలో నీటి నిల్వ 305.86 టీఎంసీలు ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులకు గాను 587.60 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయానికి 37,659 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు, విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలసి మొత్తం 47,261 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు.

నాగార్జున సాగర్ దిగువన ఉన్న కేఎల్‌రావు పులిచింతల జలాశయం కూడా పూర్తిస్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఈ జలాశయం కూడా ఆగస్టు రెండో వారంలో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తి స్థాయి నీటి నిల్వ కొనసాగుతోంది. పులిచింతల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 45.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 174.57 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయంలోకి నీటి ప్రవాహం 29,846 క్యూసెక్కులు. ఇక్కడ నుంచి 26,945 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పులిచింతల జలాశయం

గుంతల రోడ్లకు మోక్షం!



గుంటూరులో రోడ్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

- మరమ్మతులకు భారీగా నిధులు
- మూడు జిల్లాల్లో ముమ్మరంగా పనులకు శ్రీకారం
- ఇప్పటికే ఆర్అండ్‌బీ శాఖకు చేరిన నిధులు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనా నిర్వాకంతో గుంతలూరుగా పేరుమోసిన ఉమ్మడి గుంటూరుజిల్లా రహదారులకు ఎట్టకేలకు శాప విమోచన కలుగుతోంది. రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు కనిపించకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ' కార్యక్రమంతో రోడ్ల మరమ్మతులకు మోక్షం కలిగింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర రహదారులు చాలా చోట్ల గుర్తించడానికి కూడా వీలు లేనంతగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం తొలి అడుగుగా మరమ్మతుల కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు భారీ మొత్తంలో నిధులు కేటాయించింది.

● ఘోరంగా దెబ్బతిన్న రోడ్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకే గుంటూరు, పల్నాడు డివిజన్ల పరిధిలో 400 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. గడిచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో దెబ్బతినని రోడ్డు కూడా లేదు. రోడ్ల అభివృద్ధి మాట ఎలా వున్నా మరమ్మతులకు, ప్యాచ్ వర్కుల కోసం ఈఈలకు కేటాయించే నామమాత్రపు నిధులు కూడా వైసీపీ ప్రభుత్వం కేటాయించలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో కిలో మీటరుకు రూ. 25వేలుగా వున్న మరమ్మతుల ఖర్చులను రూ. 40 వేలకు పెంచి నానా హడావుడి చేసింది. కానీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో కనీసం గుంతలో మట్టి పోసేందుకు కూడా కాంట్రాక్టర్లు రాకుండా ముఖం చాటేశారు. దీంతో ఆ రోడ్లపై అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరక ప్రాయంగా, ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ఈ రోడ్లను ఇప్పటికి ఇప్పుడు బాగు చేయడం, కొత్త రోడ్డు వేయడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రంపై అది భరించలేని భారమే కాకుండా, చాలా సమయం పట్టే అవకాశం

(మిగతా 6వ పేజీలో..)

మీరే రండి

- సీఈవో ఆదేశాలు బేఖాతరు
- సచివాలయాల్లోనే కూర్చుంటున్న బీఎల్‌వోలు
- పట్టభద్రుల ఓటరు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి రావాలని ఆదేశం
- అటెస్టు చేసిన కాపీలు, ఒరిజినల్ డిగ్రీ తీసుకురావాలని సమాచారం
- ఇంటింటికి వెళ్లి పరిశీలించేందుకు బద్ధకిస్తున్న సెక్రటరీలు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఆదేశాలు అంటే జిల్లాలో లెక్క లేకుండా పోయింది. పట్టభద్రుల ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్న ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి డాక్యుమెంట్లను పరిశీలించాలని ఆయన విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల బీఎల్‌వోలు వాటిని ఉల్లంఘిస్తున్నారు. దరఖాస్తుదారుల/కుటుంబంలో ఎవరో ఒకరికి ఫోన్ చేసి మీ ఇంట్లో ఫలానా వ్యక్తి గ్రాడ్యుయేట్స్ ఎన్నికల ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొన్నారు. ఒరిజినల్ డిగ్రీ, అటెస్టు చేసిన కాపీ, ఆధార్, ఓటరు ఐడీ జిరాక్స్ కాపీలను తీసుకొని సచివాలయానికి రావరాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే తామే వస్తామని చెబుతున్నారే కానీ గంటల తరబడి నిరీక్షించినా బీఎల్‌వోలు రావడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో భాగంగా నియమితులైన గ్రామ/వార్డు సెక్రెటరీలలో కొందరు ఇంకా ఆ ప్రభుత్వంలోనే ఉన్నామన్న రీతిలో ప్రవర్తిస్తున్నారు. పనితీరుని ఏమాత్రం మార్చుకోవడం లేదు. సచివాలయాలకు రావడం, ఫీల్డ్‌కు వెళ్లకుండా అక్కడే కూర్చుని అన్నింటిని ఫోన్‌లో చక్కబెట్టుకోవాలని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయితే వారికి ఎలాంటి పని లేకపోవడంతో చివరికి ఎన్నికల విధులను సక్రమంగా

(మిగతా 6వ పేజీలో..)

నేడు సరస్వతీ భూములను పరిశీలించనున్న పవన్‌కల్యాణ్

పోషకాలు తెలుసుకునేందుకే ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్

- వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

6

రేపు బాపట్ల, పల్నాడు కాంగ్రెస్ నేతలతో ఏపీసీసీ చీఫ్ షర్మిల సమావేశం

యూట్యూబ్.. సైన్స్ మాస్టారు

- లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ పేరుతో ఛానల్
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విశేష ఆదరణ
- తెనాలికి గర్వకారణం రాయపాటి శివనాగేశ్వరరావు

8

మానవతా వాది ఆలూరి బైరాగి

- నేడు ఆలూరి జయంతి

నిధుల దుర్వినియోగంపై విచారణ..?

- పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంపై ఆరోపణలు
- బిల్లుల చెల్లింపులపై వాగ్వాదాలు
- కనిపించని ఎన్నికల సామగ్రి

పొన్నూరుటౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల సమయంలో రెవెన్యూ అధికారులుగా పనిచేసిన వారిని జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన నిధుల వినియోగంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల నిధులపై ఆడిట్ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఎన్నికల సమయంలో రెండు విడతలుగా రూ.2.17కోట్లు నిర్వహణకు మంజూరైయ్యాయి. అయితే ఆ నిధులు సరిపోలేదని సాకుతో మరో కోటి కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత ఆ ప్రతిపాదనలు పంపిన అధికారులు అందరూ బదిలీపై వెళ్లిపోయారు. ఇటీవల ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ బిల్లును చెల్లించటానికి రూ. 82.25లక్షలు మంజూరుచేసి నిధులు విడుదల చేసింది. కొత్తగా బదిలీపై వచ్చిన అధికారులు వద్ద ఎన్నికల వ్యయంకు సంబంధించి బిల్లులు అందుబాటులో లేకపోవటంతో ఆ నిధుల విడుదలకు అధికారులు నిరాకరిస్తున్నారు. అయితే ఆ నిధులు మంజూరు విషయం తెలుసుకున్న అప్పటి సూర్యనారాయణ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ ఐ ప్రశాంతి ఇటీవల పొన్నూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి బిల్లులు చెల్లించాలని అధికారులను కోరారు. తమ వద్ద కేవలం రూ.27లక్షలకు మాత్రమే బిల్లులు ఉన్నాయని మిగిలిన బిల్లులు లేకుండా నగదు చెల్లించటం కుదరదని రెవెన్యూ అధికారులు తేల్చిచెప్పారు. గత శుక్రవారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన డీటీ ప్రశాంతి తాను సొంత డబ్బు చెల్లించి భోజనాలు పెట్టానని వాటికి సంబంధించి బిల్లులు చెల్లించాలని కోరటంతో అధికారులు నిరాకరించారు. దీంతో డీటీ ప్రశాంతి కార్యాలయంలోనే బోరున విలపిస్తూ హంగామా సృష్టించారు. ఈ సంఘటనతో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అవాక్కయ్యారు. అదే సమయంలో మరో వ్యక్తి వచ్చి తనకు రూ.13లక్షలు భోజనాల బిల్లులు చెల్లించాలని కోరటం అధికారులను అయోమయానికి గురిచేసింది. ఇప్పటికే భోజనాల పేరుతో భారీఎత్తున నిధులు విడుదల చేసినా ఇంకా పెండింగ్ బిల్లులు ఉండటంతో అధికారులు అయోమయానికి గురయ్యారు. డీటీ ప్రశాంతి విలపిస్తుండటంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సమాధానం చెప్పలేక మౌనందాల్చారు. ఈ వ్యవహారం అంతా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో అధికారులను కలెక్టరేట్‌కు పిలిపించి సోమవారం విచారణ మొదలుపెట్టినట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణకు సంబంధించి బిల్లుల చెల్లింపు విషయంలో జిల్లా ఉన్నతాధికారులు వివరణ కోరటంతో అక్రమాలు బయటపడతాయేమోనని అధికారులు,సిబ్బంది హడలెత్తుతున్నారు.

అదృశ్యమైన ఎన్నికల సామగ్రి

ఎన్నికల నిర్వహణ సందర్భంగా లక్షల రూపాలయ వ్యయంతో కొనుగోలు చేసిన యంత్ర సామగ్రి అదృశ్యం కావటం వెనుక సిబ్బందిపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఎన్నికల నిధులు విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, సిబ్బంది విలువైన యంత్ర పరికరాలు మాయం కావటం పట్ల గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు 22 సీసీ కెమెరాలను కొనుగోలు చేసారు. వాటిలో 17 కెమెరాలు కనిపించకుండా పోయాయి. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇప్పించేందుకు బ్రాహ్మణకోడూరు పాఠశాల నుంచి తెప్పించిన ప్రొజెక్టర్ సైతం కార్యాలయంలో కనిపించటం లేదు. అంతేకాకుండా విలువైన కంప్యూటర్, ఇన్వర్టర్ వంటి పరకరాలు తహసీల్దార్ కార్యాలయంలో కనిపించటంలేదని తెలుస్తోంది. ఎన్నికల కోసం కొనుగోలు చేసిన ప్రతి వస్తువు తిరిగి కార్యాలయంలో అప్పగించాల్సి ఉండగా వాటిని కొందరు సిబ్బంది సొంతానికి వినియోగించుకోవటమే కాకుండా దుర్వినియోగం చేసారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే నిధుల వ్యవహారంలో విచారణ చేపట్టిన జిల్లా రెవెన్యూ అధికారులు యంత్ర పరికరాల మాయంపై కూడా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.



తహసీల్దార్ కార్యాలయంలో విలపిస్తున్న డీటీ ప్రశాంతి(ఫైల్)

రౌడీల ఆటలు సాగనివ్వం

- తెనాలి రౌడీషీటర్ లడ్డు అరెస్టు
- పీడి చట్టం అమలు చేస్తాం
- ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ రౌడీల ఆటలు సాగనివ్వమని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు. ఇటీవల తెనాలి పట్టణంలోని ఐతానగర్ లో కేవలం తన ఆధిపత్యం ప్రదర్శించుకోవడం కోసం కాకుమాను ఇంద్రజిత్తు అనే యువకుడి పై హత్యాయత్నం చేసి స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తించిన కరుడుగట్టిన రౌడీ షీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు, ఆయన అనుచరుడైన చొక్కా సురేష్ అలియాస్ సుబ్బారెడ్డి లను పోలీసులు అరెస్టు చేశారు ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గత నెల 28న రాత్రి సుమారు 11 గంటల పదినిమిషాల సమయంలో కాకుమాను ఇంద్రజిత్తు అనే వ్యక్తి తన వద్ద పనిచేస్తున్న వ్యక్తిని ఐతానగర్లోని ఆయన ఇంటి వద్ద దించి తిరిగి వస్తున్న సమయంలో అంబేడ్కర్ బొమ్మ సెంటర్ కు వచ్చేసరికి సముద్రాల పవన్ అలియాస్ లడ్డు చొక్కా సురేష్ అలియాస్ సుబ్బారెడ్డిలు అరేయ్ అని పిలవగా ఇంద్రజిత్ తనను కాదు అనుకుని ముందుకు వెళ్లిపోయాడు. ఆగకుండా వెళ్ళిపోతావా అంటూ లడ్డు సురేష మరొక స్కూటీపై వెంబడించి డొంగే వారి వీధి వద్దకు వచ్చేసరికి ఇంద్రజిత్ స్కూటీకి తమ స్కూటీని అడ్డుగా పెట్టి నిలిపివేశారు. పిల్స్తే ఆగవా అంటూ ఇటుక రాయితో తీవ్రంగా కొట్టి, కత్తితో పొడిచేందుకు ప్రయత్నించారు. దీంతో బాధితులు ఇంద్రజిత్ వారిని నెట్టివేసి అక్కడ నుంచి తప్పించుకొని తన స్నేహితుని సహాయంతో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. ఇంద్రజిత్ ను బెదిరించి గుంజుకున్న స్కూటీని

(మిగతా 6వ పేజీలో..)

- మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆర్ఐ సస్పెన్షన్
- ఆదేశాలు జారీచేసిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ
- అవినీతి ఆరోపణలను ఉపేక్షించని మంత్రి లోకేశ్

అవినీతి అధికారిపై వేటు

మంగళగిరి సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రెవెన్యూశాఖలో పని చేస్తున్న అవినీతి అధికారిపై వేటు పడింది. అవినీతి ఆరోపణలు రావడంతో మంగళగిరి తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆరే సాంబశివరావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విషయంలో ఆర్ఐ అవినీతికి పాల్పడుతున్నట్టు మంత్రి లోకేశ్ దృష్టికి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలడంతో ఆర్ఐ సాంబశివరావుతోపాటు ఆయనకు సహకరించిన సబార్డినేట్‌ను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నాగలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు.

మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం ద్వారా పారదర్శకమైన సేవలందిస్తానని, ఏ ప్రభుత్వ అధికారికి కూడా ప్రజలు లంచం ఇచ్చి పనిచేయించుకోవలసిన అవసరం లేదని మంత్రి లోకేశ్ ఎన్నికలకు ముందే చెప్పారు. ఎవరైనా అధికారి లంచం అడిగినట్టయితే తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతికి పాల్పడే అధికారులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు అవినీతి రహిత సేవలందిస్తానని, ప్రజలు కోరుకున్న విధంగా పరిపాలన చేసి రుణం తీర్చుకుంటానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

రౌడీల ఆటలు సాగనివ్వం

(5పేజీ తరువాయి)

తమ వెంట తీసుకెళ్ళి పెట్రోల్ పోసి తగలబెట్టారు.

ఉనికి చాటుకోవడం కోసమే హత్యాయత్నం

రౌడీ షీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు గడిచిన కొంతకాలంగా హైదరాబాదులో నివాసం ఉంటున్నాడు పది రోజుల క్రితం తెనాలి వచ్చాడు తన అనుచరుడైన చొక్కా సురేష్ అలియా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నువ్వు ఇక్కడ లేకపోయేసరికి మనమంటే భయం లేకుండా పోయిందని ఎవరూ మనల్ని పట్టించుకోవడంలేదని అందుకు మనం ఏదో ఒకటి చేయాలని చెప్పడంతో తమ ఉనికి కాపాడుకోవడం కోసమే ఇంద్రజిత్ పై హత్యాయత్నానికి పాల్పడి ద్విచక్ర వాహనాన్ని దాహనం చేశారని ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్, పక్కన డీఎస్పీ జనార్దన్‌రావు, వెనుక రౌడీషీటర్ పవన్ కుమార్ అలియాస్ లడ్డు, సురేష్

లడ్డుపై ఐదు హత్య కేసులు..

తెనాలిలో స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు పై ఐదు హత్య కేసులో ఉన్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. వాటితో పాటు మారణాయుధాల కేసు, మరో రెండు హత్యాయత్నం కేసులు, మరికొన్ని ఇతర కేసులు కూడా ఉన్నాయన్నారు. 2013 నుంచి లడ్డుపై రౌడీషీట్ ఉందన్నారు.

పాత కేసుల్లో బెయిల్ రద్దు...పీడి యాక్ట్ కు చర్యలు

వరుస హత్యలు, హత్యాయత్నాలు, దాడులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న లడ్డు అలియాస్ పవన్ కుమార్ పై విచారణలో ఉన్న పాత కేసుల్లో బెయిలు రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. గతంలో కోర్టు ద్వారా పోలీస్ స్టేషన్ ద్వారా మంజూరైన బెయిల్స్ రద్దు చేయించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా లడ్డు పై పీడీ యాక్ట్ అమలు చేసేందుకు చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు అదేవిధంగా ఆయన అనుచరుడు సురేష్ పై కూడా రౌడీషీట్ తెరవన్నట్లు తెలిపారు. రౌడీ షీటర్లతో కలిసి ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రౌడీ షీటర్ల విషయంలో మెతక వైఖరి అవలంబించే ప్రసక్తే లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా నేరాల్లో పాల్గొంటున్న 150 మంది రౌడీ షీటర్లను గుర్తించామని వారందరి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు వారిపై నమోదైన కేసుల్లో విచారణ పూర్తి చేస్తామన్నారు. పకడ్బందీ ఆధారాల సేకరించి శిక్షలు పడేలా చేస్తామన్నారు.

బర్నబాస్ హత్య కేసు సీఐడీకి బదిలీ

- పొన్నూరులో చర్చనీయాంశం
- ఇకనైనా వాస్తవాలు వెలుగు చూస్తాయని ఆశాభావం

పొన్నూరుటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన రేషన్ బియ్యం వ్యాపారి అంజి బర్నబాసు హత్య కేసును కూటమి ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసినట్లు సమాచారం. గతేడాది అక్టోబరు నెలలో రేషన్ బియ్యం వ్యాపారి, దళితుడైన బర్నబాసు హత్య జరిగింది. 2019-2024 మధ్య కాలంలో రేషన్ మాఫియాకు పొన్నూరు అడ్డాగా మారింది. అప్పటి పాలకుల అండదండలతో పొన్నూరులో రేషన్ మాఫియా యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగించింది. అయితే వ్యాపారుల మధ్య విభేదాలు అంజి బర్నబాసు హత్యకు దారితీశాయి. ఈ హత్య రాష్ట్ర స్థాయిలో పెను సంచలనంగా మారింది. నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం ఎన్నికల సమయంలో పొన్నూరు వచ్చినప్పుడు బర్నబాసు హత్య కేసును ప్రచార వేదికలపై ప్రస్తావించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బర్నబాసు హత్యపై సమగ్ర విచారణ జరుపుతామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సైతం దళిత సంఘాలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ కేసు సీఐడీకి బదిలీ కావడంతో పొన్నూరులో చర్చనీయాంశంగా మారింది. హతుడి భార్య నందిని తన భర్త కేసులో సరైన న్యాయం జరగలేదని మొదటి నుంచి ఆరోపిస్తుంది. తన భర్త హత్యలో అప్పటి వైసీపీ ప్రజా ప్రతినిధుల పాత్ర ఉందనీ, నెలవారి మాముళ్లు ఇవ్వలేదని హత్య చేయించారని బాహటంగానే ఆరోపించటంతోపాటు దర్యాప్తు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే ఆ సమయంలో అధికార పార్టీ నాయకుల ప్రమేయంపై తీవ్ర ఆరోపణలు రావటంతో పోలీసులు కూడా ఈ కేసు పట్ల ఉదాసీన వైఖరి అవలంబించారన్న ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తు అధికారులు 11 మందిని అరెస్టు చేశారు. వారిలో 10 మందిపై రౌడీషీట్లు తెరిచారు. హత్యలో ప్రమేయం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక నాయకులను వదిలివేశారని బర్నబాసు భార్య నందిని ఆరోపించారు. హత్య కేసులో నిందితుల నుంచి పోలీసులు భారీగా వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.



బర్నబాస్ (ఫైల్ ఫొటో)

హత్య కేసుతో సంబంధం లేని రైస్ మిల్లర్లను సైతం ఈ కేసు విషయంలో విజయవాడ పిలిపించుకుని బెదిరించి లక్షలు గుంజారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై దళిత సంఘాలు పలుమార్లు నిరసన తెలిపినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. హత్యకు గురైన బర్నబాసు సెల్‌ఫోన్‌లో ఎవరెవరికి ముడుపులు అందించారు, రేషన్ మాఫియాతో సంబంధాలు ఉన్న నాయకుల పేర్లు, వివరాలు, కీలక ఫోన్ సంభాషణలు ఉన్నట్లు బర్నబాసు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే హత్య తర్వాత ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని విషయాలను నేటికీ బహిర్గతం చేయలేదు. దళితుడు దారుణ హత్యకు గురైతే వైసీపీ నుంచి ఒక్కరు కూడా పరామర్శించడానికి వెళ్లలేదు. హత్య వెనుక వైసీపీ నాయకుల ప్రమేయం ఉండటమే కారణమని దళిత సంఘాలు అనుమానిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించటంతో ఇకనైనా వాస్తవాలు వెలుగు చూస్తాయని హతుడి కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మీరే రండి

(5పేజీ తరువాయి)

నిర్వహించడానికి కూడా బద్ధకిస్తున్నారు. ప్రస్తుతం కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నిక కోసం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉన్నది. ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్న వారివి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే బాధ్యతని బీఎల్‌వోలకు ఎన్నికల సంఘం అప్పగించింది. ఈ బీఎల్‌వోలలో చాలామంది సచివాలయాల సెక్రెటరీలు ఉన్నారు. బీఎల్‌వోలుగా ఎవరైతే అడ్మిన్ సెక్రెటరీలున్నారో వారు ఇంటింటికి వెళ్లి ఓటరు దరఖాస్తులను పరిశీలించేందుకు ఇష్టపడటం లేదు. ఎవరైనా తమ ఆఫీసుకు రావాల్సిందేనన్న ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ జారీ చేసిన ఆదేశాలు కూడా వారి చెవికెక్కడం లేదు. సోమవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు డోర్-టూ-డోర్ వెరిఫికేషన్‌కు వెళ్లకుండా తాపీగా ఆఫీసుల్లోనే కూర్చుని రమ్మని ఫోన్లలో సమాచారం ఇచ్చారు. కొందరికైతే తామే వస్తామని చెప్పి అన్ని పత్రాలను సిద్ధంగా పెట్టి ఉంచుకోవాలని చెప్పి తీరా ముఖం చాటేశారు. ఆఫీసులకు వెళ్లకుండా చాలామంది గంటల తరబడి నిరీక్షించినా బీఎల్‌వోలు రాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీనిపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటాం



పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవడం వరకే వారి పని. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలదే. బీఎల్‌వో అంటేనే బూత్ స్థాయి అధికారి అని. ఇప్పటికే టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఈ విషయంలో స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. ఆరు జిల్లాల్లో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకొంటాం. అవసరమైన డిసిప్లినరీ యాక్షన్ చేపడతాం.

- ఎన్‌ఎస్‌కే ఖాజావలి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, గుంటూరు డీఆర్‌వో

గుంతల రోడ్లకు మోక్షం!

(5పేజీ తరువాయి)

వుంది. ఈ నేపథ్యంలో తక్షణ మరమ్మతులపై ప్రభుత్వం, ఆర్ అండ్ బీ శాఖ దృష్టి సారించాయి.

- గుంటూరు జిల్లాకు.. 11.93 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చి తాత్కాలిక ప్యాచ్‌లు వేయడం కోసం ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. వివిధ దశల్లో చేపట్టే ఈ పనులకు రూ. 11.93 కోట్లు కేటాయించారు. గుంటూరుజిల్లాలో 17 మేజర్ జిల్లా రహదారుల తక్షణ మరమ్మతుల కోసం రూ. 5.78 కోట్లు, 7 రహదారుల్లో ప్యాచ్ వర్కుల కోసం రూ. 73 లక్షలు విడుదల చేశారు. వింజమూరు, పల్లెపాడు, వడ్లమూడి, సాలపాడు, నారాకోడూరు, అనంతవరపాడు జిల్లా రోడ్లలో తక్షణ మరమ్మతుల కోసం మరో 55 లక్షలు, పెదనందిపాడు- బాపట్ల, పొన్నూరు- కాకుమాను, గుంటూరు- అమరావతి, మాచవరం- అల్లూరు, గుంటూరు- తెనాలి రాష్ట్ర రహదారుల తక్షణ మరమ్మతులకు 352 కోట్లు, కొల్లూరు- కొల్లిపర, గుంటూరు చీరాల రోడ్లలో ప్యాచ్ వర్కుల కోసం రూ. 55లక్షలు కేటాయించారు. గుంటూరు- పర్చూరు రాష్ట్ర రహదారికి రూ. 60లక్షలు, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల్లో రహదారుల మరమ్మతుల కోసం మరో రూ. 20 లక్షలు, పొన్నూరు- కాకుమాను రోడ్డులో కల్వర్టు కోసం రూ. 12లక్షలు, కేటాయించారు.

- బాపట్ల జిల్లాకు 16.83 కోట్లు

బాపట్ల జిల్లాలో అద్దంకి- కొణికి, మాచవరం- అల్లూరు, తెనాలి- చందోలు, బాపట్ల- సూర్యలంక, బ్రాహ్మణకోడూరు- భట్టిప్రోలు- రేపల్లె రాష్ట్ర రహదారుల మరమ్మతుల కోసం రూ. 80.5 లక్షలు, గుంటూరు- చీరాల రహదారి ప్యాచ్ వర్క్ కోసం రూ. 72.5 లక్షలు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డులో కల్వర్టు కోసం రూ. 34 లక్షలు కేటాయించారు. వేమూరు నియోజకవర్గంలో బ్రాహ్మణ కోడూరు- భట్టిప్రోలు రోడ్డుకు, అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి- సంతమాగులూరు రోడ్డుకు, పర్చూరు నియోజకవర్గంలో ఇంకొల్లు- పంగులూరు, చీరాల- ఒంగోలు, బాపట్ల- పర్చూరు, పర్చూరు- జాగర్లమూడి రాష్ట్ర రహదారుల మరమ్మతులకు రూ. 155 లక్షలు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 32 జిల్లా రహదారుల్లో మరమ్మతుల కోసం రూ. 1060.70 లక్షలు(10.61 కోట్లు), ప్యాచ్ వర్కుల కోసం రూ. 70 లక్షలు, మరో 13 రోడ్లకు మరమ్మతుల నిమిత్తం రూ. 176 లక్షలు, ప్యాచు వర్కులకు రూ. 35 లక్షలు కేటాయించారు.

- పల్నాడు జిల్లాకు.. 6.65 కోట్లు

నరసరావుపేట డివిజన్ పరిధిలో 8 జిల్లా మేజర్ రహదారులకు మరమ్మతుల కోసం రూ. 223.9 లక్షలు, 13 రోడ్లలో ప్యాచ్ వర్కుల కోసం రూ. 142.2 లక్షలు, కొండవీడు ఘాట్ రోడ్డు కోసం రూ. 6 లక్షలు, మాచర్ల- గుటూరు జిల్లా రహదారికి మరమ్మతుల కోసం రూ. 40 లక్షలు కేటాయించారు. ఈ జిల్లాలో రాష్ట్ర రహదారుల్లో 7 చోట్ల మరమ్మతుల కోసం రూ. 172.5లక్షలు, ప్యాచ్ వర్కుల కోసం రూ. 79.85 లక్షలు కేటాయించారు. అయితే ఇప్పటికే ఆయా జిల్లాలో మరమ్మతు పనులు చేపట్టారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ముందుకు నడిపిస్తున్నారు.

ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

- తూర్పు గోదావరి విన్నర్స్
- గుంటూరు జిల్లా రన్నర్స్

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 68వ అంతర్ జిల్లా అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. చెంచుపేటలోని కేఎస్ఎం హైస్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన క్రీడల్లో వివిధ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో 81 కిలోల్లో తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారిణి సీహెచ్ శ్రీసాత్విక, కృష్ణా జిల్లా క్రీడాకారిణి ఎండీ నూర్జహన్, గుంటూరు జిల్లా క్రీడాకారిణి కె.తనుశ్రీ విజయం సాధించారు. 81 కిలోలు పైబడిన విభాగంలో కె.అలేఖ్య (అనంతపూర్), జి.స్వాతి (గుంటూరు), ఎన్.జ్యోత్స్న (తూర్పు గోదావరి) విజయం సాధించారు. బెస్ట్ లిఫ్టర్‌గా తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారిణి జుహితగుణ 208 పాయింట్లతో అగ్రశ్రేణిలో నిలిచారు. టీం ఛాంపియన్‌షిప్‌ను తూర్పు గోదావరి జిల్లా విన్నర్స్‌గానూ, గుంటూరు జిల్లా క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. 102 కిలోల బాలుర విభాగంలో జి.సుబ్రహ్మణ్యం, ఎస్.దూద్‌వలి, డి.దీనరాజు, 102 కిలోల పైబడిన విభాగంలో వి.అప్రూప్, శ్రీచంద్ర, జి.నవదీపక్ గెలుచుకోగా, బెస్ట్ లిఫ్టర్‌గా కడప క్రీడాకారుడు షేక్ మాదాహర్షద్ 155 పాయింట్లతో నిలిచాడు. టీం ఛాంపియన్స్‌గా తూర్పు గోదావరి జిల్లా విన్నర్స్‌గా, గుంటూరు జిల్లా రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు మెడల్స్, బహుమతులను అందజేశారు. పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, దేవదాసు, గోవింద్, సూర్యప్రకాష్, మానస, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలతో కమిటీ సభ్యులు

పోషకాలు తెలుసుకునేందుకే ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్

- వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

గుంటూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం వల్ల నేల సారూప్యంలో భారీ మార్పులు చోటు చేసుకొంటున్న నేపథ్యంలో నేలలో ఉన్న పోషకాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఎంఐఆర్ ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ తెలిపారు. ఈ పరిశోధనలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. రైతు సాధికార సంస్థ, ఐజి గార్ల్ సంయుక్తంగా కెఎఫ్‌డబ్ల్యూ సహకారంతో సోమవారం లాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో భూమిలోని పోషకాలను తెలుసుకొనేందుకు ఏర్పాటు చేసిన ఎంఐఆర్ ఆల్ఫా స్పెక్ట్రల్ ల్యాబ్‌ను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి. విజయ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ టి. విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఫలితాలు పరిశోధనల ద్వారా దేశవ్యాప్తంగా తెలియజేయాలని అభిప్రాయపడ్డారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయని, అందుకు తగినట్లుగా పరిశోధనలను విస్తృత పరచాలని సూచించారు. భూమిలో అనేక రకాల శాంపిల్స్ తీసుకొని ఈ ల్యాబ్ ద్వారా పరిశోధన చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ శారద జయలక్ష్మి దేవి, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్ పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్

ప్రశంసా పత్రాలు అందజేత

పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని డ్రోన్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అమరావతి డ్రోన్ హెక్తాన్- 2024లో పాల్గొన్న వారికి సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రేపు బాపట్ల, పల్నాడు కాంగ్రెస్ నేతలతో ఏపీసీసీ చీఫ్ షర్మిల సమావేశం

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహించేందుకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోజువారీ షెడ్యూల్ ప్రకటించారు. ఇందులో భాగంగా ఈనెల 6న బాపట్ల, నరసరావుపేట జిల్లాల నాయకులతో విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బాపట్ల, నరసరావుపేట జిల్లాల నేతలకు సమాచారం అందించారు. ఇటీవల జిల్లాలకు నూతన కాంగ్రెస్ అధ్యక్షులను నియమించిన ఆమె కొత్తగా అనుబంధ విభాగాల నియామకాలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు వంటి అంశాలపై చర్చించనున్నట్లు నేతలు తెలిపారు.

పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సదరన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌టీఎల్‌టీవో) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారాల కోసం మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రైవేట్ స్కూలు, కాలేజి డైరెక్టర్లు, మహిళ ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ కాలేజి, డిగ్రీ కాలేజి విశ్వవిద్యాలయ ఆచార్యులు, సహచరులు డిసెంబర్ 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవార్డుల ప్రదానం జనవరిలో గుంటూరులో నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం 949929674, 7989088274లో సంప్రదించాలని సూచించారు.

ఇసుక పోసినందుకు కూలి మాత్రమే తీసుకోవాలి

- సబ్‌కలెక్టర్ సంజనసింహ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, నవంబరు 4 (ఆంధ్రజోతి): ఉచిత ఇసుకపై గందరగోళంగా ఉందని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో సబ్‌కలెక్టర్ సంజనసింహ సోమవారం మండల పరిధిలోని మున్నంగి ఇసుకరీచ్‌ని తహసీల్దార్ సిద్ధార్థతో కలిసి ఆమె తనిఖీ చేశారు. కూలీలతో, ఇసుక వినియోగదారులతో మాట్లాడారు. ఇసుకను ట్రాక్టర్‌లో పోసినందుకు ఎంత వసూలు చేస్తున్నారని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంజనసింహ మాట్లాడుతూ ట్రాక్టర్‌లో ఇసుక పోసినందుకు రూ.600 మాత్రమే తీసుకోవాలన్నారు. అదనంగా వసూలు చేస్తే వారి పట్ల తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు కూడా అదనంగా వసూలు చేసినట్లు తెలిస్తే ఆ వాహనాన్ని సీజ్ చేస్తామన హెచ్చరించారు. కృష్ణానదిని ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాల వారికే ఇసుకను ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తెనాలి, గుంటూరు దూర ప్రాంతాల వారు ఇసుకను తీసుకెళ్లాడానికి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడనున్నట్లు తెలియజేశారు.

సీఎంపై అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుపెట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఆల్ల జగదీష్ రెడ్డి అనే వ్యక్తి సోషల్ మీడియాలో సీఎం ఫేసు మార్ఫింగ్ చేసి ప్రజల్లో ఆయన ప్రతిష్ట దెబ్బతినేలా అభ్యంతరకర పోస్టు పెట్టాడని తెనాలి టీడీపీ బీసీ సెల్ నాయకుడు పణిదపు దుర్గ ఫిర్యాదు చేశాడు. పోస్ట్ చేసిన వ్యక్తికి సంబంధించి సోషల్ మీడియా స్క్రీన్ షాట్స్, ఇతర ఆధారాలు పోలీసులకు అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు సరస్వతీ భూములను పరిశీలించనున్న పవన్ కల్యాణ్

పిడుగురాళ్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా మాచవరం మండలం చెన్నాయపాలెం సమీపంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబానికి చెందిన సరస్వతీ భూములను మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గతవారం సరస్వతి భూములలో రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. కొన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా సరస్వతి భూములు జగన్ కుటుంబం కలిపేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా పరిశ్రమ పేరుతో కొన్నేళ్ల క్రితం భూములు కొనుగోలు చేసి పరిశ్రమను నిర్మించకపోవడంతో అనేకమంది ఉపాధి అవకాశాలు లేకుండా పోవడంపై కూడా ఇటీవల పెద్ద ఎత్తున రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సరస్వతి భూముల పరిశీలన కోసం వస్తుండడం చర్చనీయంగా మారింది. సోమవారం రాత్రి బాగా పొద్దుపోయాక పవన్ కల్యాణ్ పర్యటనకు సంబంధించిన సమాచారం అందినట్లు అధికారులు ధ్రువీకరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

35,381 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,989 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 35,381 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,765 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	8500	16000
నెంబరు. 5	8500	13500	నెంబరు. 5	--	--
273	10000	12500	273	11500	13000
341	10000	16000	341	11000	13000
4884	10500	14000	4884	12600	17000
సూపర్ 10	11500	11500	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18300	తేజ	8000	17800
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	8800	13000
దేవనూరు డీలక్స్	10000	14500	దేవనూరు డీలక్స్	12500	13000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	11000

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 587.00 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9767 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5948 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 46,506 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,506 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టాలెంట్ టెస్టులో సత్తాచాటిన జేకేసీ విద్యార్థులు

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ టాలెంట్‌టెస్టులో జేకేసీ కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఎస్ మౌనికదుర్గా, బీ సాయిసాకేత్‌వర్మ, కే నాగ శ్రీవల్లి తదితరులు వరు సగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు సాధించారని తెలిపారు. ఎస్ మానసరెడ్డి, పఠాన్‌లతీఫ్, డీ కళ్యాణి, వీ శ్రీనేహ, ఆర్ నేహ శ్రీలక్ష్మీ తదితరులు కన్సోలేషన్ బహుమతులు సాధించారని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ టాలెంట్ టెస్టు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుంటూరు(తూర్పు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే చదలవాడ జయరాంబాబు వర్ధంతి కార్యక్రమం నగరంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కొరిటెపాడు ప్రధానదారిలో ఉన్న చదలవాడ జయ రాంబాబు కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చదలవాడ రఘురాం, మిరియాల వీరయ్య, ఆర్‌బీ ఫ్రాంక్లిన్, రాజారావు, ఆలపాటి శ్రీనివాసరావు, మోహన్ రఘురాం, కాకుమాను రత్నంరాజు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా స్కిల్ సర్వే చేయాలి

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల వారీగా ఇంటింటి స్కిల్ సర్వే పక్కాగా చేసి, ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు తెలిపారు. గుంటూరులో యువత నైపుణ్యంపై చేపట్టనున్న సర్వేపై వార్డు సచివాలయ కార్యదర్శులకు స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక మంలో జీఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాస రావు, ఉపా సెల్ పీవో రామారావు, జిల్లా ఉపా ధి అధికారి రమాదేవి, స్కిల్ డెవలప్‌మెంట్ అ ధికారి సంజీవరావు, జీఎంసీ కో ఆర్డినేటర్ మ నుదీప్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రపంచ రికార్డుకు శ్రీచైతన్య విద్యార్థులు సిద్ధం'

● ఏజీఎం డాక్టర్ అంజయ్య

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 6న నిర్వహించే మ్యాథమ్యాటిక్స్ వరల్డ్ రికార్డు కోసం గుంటూరులోని శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్ ప్రీప్రైమరీ విద్యార్థులు సిద్ధం అయ్యారని సంస్థల ఏజీఎం డాక్టర్ అంజయ్య వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులను ఆయన సోమవారం అభినందించారు. డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు నృత్యం, చిత్రలేఖనం, కరాటే, యోగా వంటి శిక్షణ ఇక్కడ అందిస్తున్నామని తెలిపారు. మేధాశక్తిని పెంచేలా 2023లో తమ విద్యార్థులు 40 నిమిషాల్లో 100 మ్యాథ్స్ టేబుల్స్ చెప్పి రికార్డు సృష్టించారని వెల్లడించారు. ఈ ఏడాది 600 మ్యాథ్స్ ఫార్ములాలపై నిర్వహించే ప్రపంచ రికార్డు కోసం తమ విద్యార్థులు మద్ది అనూషదేవి, రెడ్డి శిరిష ప్రత్యేక శిక్షణ అందించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్మద, కోఆర్డినేటర్స్ సౌజన్య, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం శక్తిని అందిస్తుంది

● ప్రకాశం డీఈవో అత్తోట కిరణ్‌కుమార్

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మనిషికి విజ్ఞానం శక్తిని, ప్రవర్తన గౌరవాన్ని అందిస్తుందని ప్రకాశం డీఈవో అత్తోట కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం విద్యానగర్‌లో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టుకు ఉచిత శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల తో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోచింగ్ నిపుణులు జి.ప్రకాష్, రెహమాన్, ఆదినారాయణ, శ్రీలక్ష్మి, మానవతా సెక్రటరీ కే సతీష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అపహరించిన అగంతకులు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ వద్ద ఓ మహిళ ప్రయాణికురాలి చేతిలో నుంచి అగంతకులు సెల్ ఫోన్ గుంజుకెళ్ళారు. ఆదివారం రాత్రి గుంటూరు రైల్వే స్టేషన్ బయటకు వచ్చిన ప్రయాణికురాలు వాసవి ఆటో కోసం ఎదురు చూస్తున్న సమయంలో అదును చూసి ఈమె చేతిలోని ఫోన్‌ను దొంగలు గుంజుకుని వాహనంపై ఉడాయించారు. బాధితురాలు కొత్తపేట పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసారు.

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన నిందితుడి అరెస్టు

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ మోసపూరిత ప్రకటనలు చేసి డబ్బు వసూలు చేసి బోర్డు తిప్పేసిన బోగస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కేసులో నిందితుడైన మల్లికార్జునరెడ్డిని సోమవారం అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో నిందితులైన శ్రావణ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

● తమ చేత పనిచేయించుకొని జీతాలు ఇవ్వకుండా సెక్యూరిటీ ఏజెన్సీస్ సంస్థ ఇబ్బంది పెడుతుందని అందులో సెక్యూరిటీ వారుగా పనిచేసిన ఇద్దరు మహిళలు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

హత్యాయత్నం చేసిన నిందితుడి...

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ పత్రా ల్లో నామినీగా పేర్కొన్న తన భార్య పేరు తప్పుగా రాశారనే కోపంతో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ ఉద్యోగి పులిగడ్డ రాజేష్ పై హత్యాయత్నం చేశాడు. ఈ కేసులో నిందితుడైన పెదకాకాని ఆర్‌డబ్ల్యూఎస్‌లో వాటర్ సప్లై ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వ హిస్తున్న కందుల శ్రీనివాసరావును సోమవారం పోలీసులు అరెస్టు చేసారు. గత నెల 29న ఉదయం అరండల్‌పేట 7/1 లోని కేర్ ఇన్సూరెన్స్ కంపెనీలో డేటా ఆపరేటర్ మేనేజర్ గా పని చేస్తున్న పులిగడ్డ రాజేష్‌పై శ్రీనివాసరావు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి దిగాడు.

కోర్టు కేసులతో అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 151 అర్జీలు

● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కోర్టులకు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 151 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో కే.శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీ, జీఎంసీ విభాగాల్లో అధికంగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వంద నం, హర్టీ కల్చర్ డీడీ రవీంద్ర, మత్స్యశాఖ ఏడీ గాలిదేముడు, జిల్లా కల్పనాధికారి రమాదేవి పాల్గొన్నారు.

వీఆర్‌ఏల అదనపు బాధ్యతలను రద్దు చేయాలి

నిబంధనలకు విరుద్ధంగా వీఆర్‌ఏలకు అదనంగా కేటాయించిన నైట్ వాచ్‌మెన్, ఇసుక రీచ్‌ల బాధ్యతలను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. అధికారంలోకి రాగానే వీఆర్‌ఏల జీతం రూ.15వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని నెర వేర్చాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగేశ్వరరావు, హనుమంతురావు, బుజ్జిబాబు, దేవ భిక్షం తదితరులున్నారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించాలి

పాతగుంటూరు ప్రాంతంలో అధికంగా ఉన్న భూమి రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ పాతగుంటూరు అభివృద్ధి సంఘం నాయకుడు యడ్ల నాగమల్లేశ్వరరావు అర్జీ అందజేశారు. ఈ ప్రాంతంలో ఎకరం రూ.2కోట్లు పలుకుందని, కానీ మార్కెట్ విలువ రూ.7 కోట్లుగా ఉండటంతో రిజిస్ట్రేషన్ కోసం రూ.60 లక్షలు ఖర్చు అవుతుందని, దీంతో భూములు కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపారు.

వసతి గృహాల్లో పూర్తిస్థాయి వార్డెన్లను నియమించాలి

ఇన్‌చార్జీ వార్డెన్ల పద్ధతి గాకుండా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పూర్తిస్థాయి వార్డెన్లను నియమించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు అర్జీ అందజేశారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో దాదాపు ముగ్గురు వార్డెన్లతో పని చేస్తున్నారని, వారికి పూర్తిస్థాయి వార్డెన్స్‌గా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ప్రభుత్వ వసతి గృహాల్లో పూర్తిస్థాయి రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలి : కలెక్టర్

గుంటూరు సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంఏవై ద్వారా హౌసింగ్ లే అవుట్లలో, సొంత స్థలాలు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్‌లోను, సొంత స్థలాల్లోను పీఎంఆవాస్ యోజన గ్రామీణ్, అర్బన్‌లో మంజూరు చేసిన ఇళ్లు 2024 డిసెంబరు 31 నాటికి పూర్తయ్యేలా ప్రతి వారానికి నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగ మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, సీపీవో శేషశ్రీ, డ్వామా పీడీ శ్రీనివాసులు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి, జిల్లా సహకారశాఖ అధికారి వీరాచారి, విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడీ సువార్త పాల్గొన్నారు.

ఆక్రమణలు పునరావృతమైతే సచివాలయం సిబ్బందిదే బాధ్యత

● కమిషనర్ శ్రీనివాసులు



ఆక్రమణ తొలగింపుపై అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధి లో రోడ్లు, డ్రెయిన్ల మీద తొలగించిన ఆక్రమణలు పునరావృతమైతే సంబంధిత వార్డు సచివాలయ ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులదే బాధ్యత అని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ అమరావతి రోడ్డులో ఆక్రమ ణల తొలగింపు, కంపోస్ట్ యార్డ్‌లో వ్యర్థాల తరలింపు, ఏబీసీ సెంటర్లో వీధి కుక్కల ఆపరేషన్లు, అందుకు తగిన ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ తొలుత అమరావతి రోడ్డులోని డ్రెయిన్ మీద, రోడ్డు మీద ఆక్రమణల తొలగింపును పరిశీలించారు. అనంతరం ఏటుకూరు రోడ్డులోని వీధి కుక్కల ఏబీసీ సెంటర్‌ని పరిశీలించి నూతన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆపరేషన్ అనంతరం పోస్ట్ కేర్ కోసం ప్రత్యేక బోనులు తెప్పించాలని ఈఈని ఆదేశించారు. పశువైద్య విభాగం నుంచి సీనియర్ డాక్టర్‌ని డెప్యుటేషన్‌పై తీసుకురావడానికి ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎంవోహెచ్‌ని ఆదేశించారు. అనంతరం కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, ప్రాంగణం శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కి తరలించాలన్నారు. ఈఈ సుందర్రామిరెడ్డి, సీఎంవోహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌వో డాక్టర్ రవి బాబు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్ అర్జీలు వారంలో పరిష్కరించాలి

గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను మరుసటి వారానికి పరిష్కరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన 27 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఆర్జీల్లో వీధి దీపాల సమస్యలు 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 71 ఫిర్యాదులు అందాయని వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు.

ముగిసిన గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వీవీవీ హెల్త్ హబ్‌లో జరిగిన గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. పోటీల్లో డబుల్స్ విభాగంలో టి.అరుణ్ కుమార్, కె.విన్సెంట్‌లు విజేతలుగా నిలవగా, ఎన్ శ్రీధర్, సిహెచ్ శివలు రెండో స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో మధు స్మిత విజేతగా, మంజులా దేవి రెండో స్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు గురుదత్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ఎం శివకుమార్, వీవీ హెల్త్ హబ్ డైరెక్టర్లు టి.అరుణ్‌కుమార్, హరికృష్ణలు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాద్, నాగరాజు, మన్సూర్ వలి. మాదాల భరత్ కుమార్, చరణ్, పాల్ మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారిని మోసం చేసిన ఏఎస్ఐ

● ఇల్లు కొంటామని వచ్చి రూ.14 లక్షలు తీసుకుని మోసం

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితుడు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మోసగాళ్లను చట్ట ప్రకారం శిక్షించి బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కలిగిన ఓ ఏఎస్ఐ మోసగాడి అవతారం ఎత్తారు. ఓ వ్యక్తిని పారిశ్రామికవేత్తగా అవతారం ఎత్తించి మిర్చి వ్యాపారిని పథకం ప్రకారం మోసం చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మిర్చి వ్యాపారి రావుల వరాలు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బాధితుడు వరాలు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంటూరులోని రాముల వారి గుడి వీధికి చెందిన రావుల వరాలు మార్కెట్ యార్డులో మిర్చి కమిషన్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు నగరంపాలెం రెండవలైన్‌లో 560 చదరపు గజాల స్థలంలో పాత ఇల్లు ఉంది. దానిని వరాలు అమ్మకానికి పెట్టగా, గతంలో కొత్తపేట పోలీస్‌స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన పసుపులేటి మదుసూదన్‌రావు అలియాస్ మధు రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా తన వద్దకు వచ్చాడన్నారు. ఇల్లు విక్రయిస్తే తనకు కమిషన్ రూపంలో ఐదు లక్షలు ఇవ్వాలని కోరాడన్నారు. రామిరెడ్డితోటకు చెందిన అన్నపురెడ్డి గురునాథంని పారిశ్రామికవేత్తగా చిత్రీకరించి కారులో తన వద్దకు తీసుకు వచ్చాడన్నారు. తన ఇంటిని రూ.2 కోట్లకు కొనుగోలు చేసేందుకు బేరం కుదుర్చుకున్నారన్నారు. గురునాథంకు ప్రకాశం జిల్లా చీమకుర్తిలో గ్రానైట్ ఫ్యాక్టరీ ఉందని, దానిని రూ.52 కోట్లకు విక్రయించినట్లు చెప్పాడన్నారు. 14 లక్షలు జీఎస్టీగా చెల్లించాలని ముందుగా ఆ మొత్తం అప్పుగా ఇస్తే డబ్బు రాగానే మీ ఇంటిని కొనుగోలు చేస్తామని నమ్మించారన్నారు. దీంతో తాను ఏఎస్ఐ మాటలు నమ్మి ఆయనకు 14 లక్షలు ఇచ్చానన్నారు. ఆ డబ్బులు అడగ్గా తనను నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి విధి నిర్వహణలో ఉన్న పోలీస్ విధులకు ఆటంకం కలిగించానని, కేసు పెడతానని బెదిరించాడన్నారు. మిర్చి వ్యాపారి వరాలును మోసం చేసిన ఇరువురిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాల్సిందిగా ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌ను పోలీస్ అధికారులు ఆదేశించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో నివాసం ఉంటున్న వినుకొండకు చెందిన నిందితుడు షేక్ రఫిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ వీరేంద్రబాబు నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. పట్టాభిపురం సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు రఫి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుంటాడు. దుర్వసనాలకు అలవాటుపడిన రఫీ జల్సాలకు డబ్బులు సరిపోక దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. అక్టోబరు 2న రాత్రి గుంటూరు శ్యామలనగర్ 1వ లైనులో గల షైమార్ట్ సూపర్ బజార్ దుకాణంలో రూ.92500 దొంగిలించాడు. గత నెల 14న పెదకాకాని రోడ్డులో ఏ టు జడ్ కార్ షెడ్ వద్ద ఏపీ16 ఇఎఫ్ 5654 నెంబరు గల కారును దొంగిలించుకు పోయాడు. తిరిగి దొంతనం చేసే ప్రయత్నంలో ఉండగా పోలీసులు నిందితుడు రఫిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేయటంలో ప్రతిభ కనపర్చిన ఎస్ఐ డి.ఆంజనేయులు, ఏఎస్ఐ వీరాంజనేయులు, కానిస్టేబుల్ జె శ్రీనివాసరావును ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

పాత మిత్రులతో ఆత్మీయ కలయిక



టెన్నిస్ ఆడుతున్న ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ శివశంకర్

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఎంఈడీసీ) చైర్మన్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి శివశంకర్ సోమవారం నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌ను సందర్శించి కొద్దిసేపు సరదాగా టెన్నిస్ ఆడారు. గ్రూప్ 1 అధి కారిగా సేల్స్ ట్యాక్స్ డిపార్టుమెంటులో తన ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన గుంటూరు, కృష్ణా జిల్లాల్లో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. జీఎస్టీ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో జనసేనాని పవన్ కల్యాణ్ పిలుపు మేరకు తన ఉద్యోగానికి రాజీనామా చేసి శివశంకర్ జనసేన పార్టీలో చేరారు. పవన్ కూడా ఆయన సేవలను వినియోగించు కుంటూ కీలకమైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిలో నియమించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇటీవల ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ పదవిలో ఆయనను నియమించింది. విద్యావంతుడు, సమర్థ అధికారిగా పేరు గడించిన తమ్మిశెట్టి శివశంకర్‌రావు తన పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆఫీసర్స్ క్లబ్‌లో తన సహచర ఉద్యోగులను, మిత్రులను కలుసుకొని వారిని ఆత్మీయంగా పలుకరించారు. ఈ సందర్భంగా వారు శివశంకర్‌ను సత్కరించారు.

సభ్యత్వ నమోదు ద్వారా మాత్రమే బీజేపీ బలోపేతం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి

గుంటూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా మాత్రమే బీజేపీ దేశ స్థాయిలో బలోపేతం అవుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం గుం టూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకుడు నేరెళ్ల మాధవరావు అధ్యక్షత వహిం చారు. భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా ప్రాథ మిక సభ్యత్వం, క్రియాశీల సభ్యత్వాలు పూర్తిచేసుకుని మండల అధ్యక్షులను నియమిం చుకోవడం కోసం మండల ఎలక్షన్ అధికారులను, ఎలక్షన్ కో-ఇన్‌చార్జులను నియ మించుకున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోస్తాంధ్ర జోన్ సభ్యత్వ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి మకుటం శివ, జిల్లా సాధారణ సభ్యత్వ ఇన్‌చార్జి పాలపాటి రవికుమార్, క్రియాశీలక సభ్యత్వం ఇన్‌చార్జి కొత్తూరు వెంకట సుబ్బారావు, జిల్లా ఎలక్షన్ సహ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, నరసరావుపేట నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, గాజు ల వెంకయ్య నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తిరుపతిరావు, కుమార్ గౌడ్, మం డల అధ్యక్షులు పాల్గొన్నారు.

క్రీడా, సాంస్కృతిక పోటీల్లో బాలకుటీర్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులు వివిధ విభాగాల్లో గెలుపొందారని సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ మంగాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ ఆధ్వర్యంలో అక్టోబర్ 27, నవంబరు 3వ తేదీల్లో లాంగ్‌జంప్, రిలేరన్, వాలీబాల్, వ్యాసరచన, చిత్రలేఖనం, స్పెల్‌బీ తదితర పోటీల్లో విజయం సాధించారని తెలిపారు. పోటీల్లో ఆరు ప్రథమ, 5 ద్వితీయ, 4 తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. విద్యార్థులను సీఏవో దుర్గారఘురామ్, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్ ఎండీ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న తదితరులు అభినందించారు.

'నన్నపనేని'కి అభినందనలు

గుంటూరు(తూర్పు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావును ఆయన నివాసంలో సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సం దర్భంగా అప్పారావు మాట్లాడుతూ నన్నపనేనికి టీటీడీలో కీలకమైన బాధ్యతలు అప్పజెప్ప డం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎల్‌వీఆర్ క్లబ్ జాయింట్ కార్యదర్శి కే శ్రీనివాస రావు, టీడీపీ నాయకులు చిన్నా, ఎం నరసింహారావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ



రవీంద్రనగర్‌లోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస ప్రారంభోత్సవాలు నగరం లో వైభవంగా మొదలయ్యాయి. పలు శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తుల తో శివాలయాలన్నీ కిటకిటలాడాయి. రవీంద్రనగర్, కొత్తపేట, అరండల్‌పేట, బ్రాడీపేట, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు తదితర శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకు నేం దుకు బారులు తీరారు. సాయంత్రం దేవాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. దేవాలయాల ప్రాంగణంలో ప్రమీదలతో శివలింగాకారాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఏకాదశి రుద్రాభిషేకాలు జరిపారు. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



అరండల్‌పేట శివాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

జంతుజాతి సంరక్షణకు పశుగణన ముఖ్యం

● జిల్లా పశు సంవర్ధక అధికారి నరసింహారావు



గుంటూరు సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏ జాతికి చెందిన పశువులు ఎన్ని ఉన్నాయి.. వాటిలో తరచుగా ఏ వ్యాధులు వస్తున్నాయి.. సంతానోత్పత్తి ఎలా ఉంది.. ఇత్యాది వివరాలు సేకరించే ప్రక్రియ జిల్లాలో చురుగ్గా సాగుతున్నట్టు జిల్లా పశుసంవర్థక అధికారి ఓ నరసింహారావు తెలిపారు.



ప్రశ్న : పశుగణన ముఖ్య ఉదేశ్యం ఏమిటి?

జవాబు : మొత్తం 16 రకాల పశువులు ఉన్నాయి. జాతుల వారీగా వాటిలో ఉత్పాదకత ఎలా ఉంది. రోగాలు ఏమైనా ఉన్నా యా? వంటి వివరాలు సేకరించి తీసుకోవాల్సిన చర్యలపై అప్రమత్తం చేయడం కోసమే.

ప్రశ్న : పశుగణన అసలు ఎప్పుడు మొదలయ్యింది?

జవాబు : ఇది 1919లోనే అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ. అప్పటి నుంచి ప్రతి ఐదేళ్ల కొకసారి పశుగణన తప్పకుండా జరుగుతూనే ఉంది. ఇప్పటికి 20 సార్లు జరిగింది. ఇప్పుడు జరిగేది 21వ సారి.

ప్రశ్న : మొత్తం ఎంత మంది ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు?

జవాబు : జిల్లాలో ఉన్న పశువులను లెక్కించేందుకు 185 మంది ఎన్యూమరేటర్లను నియమించాం. వాళ్లు మొత్తం 6.80 లక్షల గృహాలను సందర్శించి వివరాలు సేకరిస్తారు. 55 మంది సూపర్‌వైజర్లు ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

ప్రశ్న : ఈసారి పశు గణన విశిష్టత ఏమిటి?

జవాబు : ఇప్పుడు జరిగేది నిజంగా విశిష్టమైనదే. గతానికి భిన్నంగా పూర్తి డిజి టల్ మోడ్‌లో జరుగుతుంది. ఎన్యూమరేటర్లు యాప్ ద్వారా పశువుల వివరా లుసేకరిస్తారు. సమాచారం అంతా ఆన్‌లైన్లో రికార్డు అవుతుంది.

ప్రశ్న : ప్రజలకు మీరు చెప్పే సందేశం?

జవాబు : పశుగణన కోసం వస్తున్న సిబ్బందికి ప్రజలు పూర్తిగా సహకరించాలి. పశువుల వివరాలు చెప్పటం మీకే ప్రయోజనం అన్న సంగతిని గ్రహించాలి.

గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పరుగులు

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



పార్టీ సభ్యత్వం నమోదు చేస్తున్న గళ్లా మాధవి

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నగరంలోని 44వ డివిజన్లో రూ.కోటి 63 లక్షలతో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. కొరిటెపాడు గాంధీ విగ్రహం నుంచి చాగంటి సాంబిరెడ్డి వీధి వరకు 250 మీటర్లు సీసీ రోడ్డు, యూజీడీ పనులు, రూ.90 లక్షల విలువచేసే సైడ్ కాలువల పనులు, కరణం వారి వీధిలో 300 మీటర్ల సీసీ రోడ్డు, యూజీడీ పనులు, రూ.73లక్షల సైడ్ కాలువల పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. అనంతరం కొరిటెపాడు పార్క్ గేటు వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు, తెలుగుదేశం సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే మాధవి పరిశీలించారు. 2021 నాటికి పట్టభద్రులయిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకొని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గళ్లా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యర్రకుల శ్రీనివాస్‌రావు, పవన్ వెంకి, కన్నసాని రాజా, కన్నసాని బాజీ, మద్దిరాల మ్యాని, కసుకుర్తి హనుమంతరావు, ఈరంటి వరప్రసాద్, బెజవాడ కృష్ణారెడ్డి, కటకం సెట్టి విజయలక్ష్మీ, ఆవుల వెంకటేశ్వరావు, కొల్లి అనిల్, దుడికి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 మెయిన్స్‌ను వాయిదా వేయండి

● ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ మంత్రి ఆలపాటి

గుంటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయా లని ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ అనూరాధను తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ కోరారు. కృష్ణా- గుంటూ రు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సహ పలువురు ఎమ్మెల్సీలకు నిరుద్యోగ పట్టభద్రుల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీల తరపున ఎమ్మెల్సీ చిరంజీవిరావు సోమవారం ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్ అనూరాధను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షను జనవరి 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏపీపీ ఎస్సీ ఇటీవల ప్రకటన చేసిందని, ప్రిపరేషన్‌కు తగిన సమయం లేదని, ఆకస్మాత్తుగా తేదీలు ప్రకటించడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని వారు తమకు విజ్ఞప్తి చేస్తున్నారని చిరంజీవిరావు ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌కు వివరించారు. పరీక్షలను మరో నెల రోజులపాటు వాయిదా వేసి ఫిబ్రవరి మొదటివారంలో పరీక్షలు నిర్వహించాలని కోరారు.

రసాయనశాస్త్రంలో పరిశోధనలపై దృష్టి పెట్టాలి

● జేకేసీ కళాశాల వర్క్‌షాపులో వక్తలు

గుంటూరు(విద్య), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్రంలో పరిశోధనలకు విస్తృ త అవకాశం ఉందని రసాయనశాస్త్ర నిపుణులు డాక్టర్ పీవీఎస్ఎన్ మల్లేశ్వరరావు, ఆచార్య వి.వెంకటరావు అన్నారు. జేకేసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన రసాయనశాస్త్ర వర్క్ షాపులో వారు మాట్లాడారు. ఔషధ పరిశ్రమలో ఉపయోగించే క్రోమటోగ్రఫీ విధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, రసాయనశాస్త్ర హెచ్‌వోడీ ఎంగోరీశంకర్, ఎన్ మాధవి, రాహుల్, ఐ హట్టి, కె.అనిత పాల్గొన్నారు.

బంగారం షాపు పెట్టిస్తానని.. రూ.4.5 కోట్లు స్వాహా

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ఓ మహిళకు బంగారపు షాపు పెట్టిస్తానని ఇంకో మహిళ నాలుగున్నర కోట్లు నొక్కేసింది. భర్త చనిపోవడం, ఇద్దరు పిల్లలు ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లిన నేపథ్యంలో బాధితురాలు వీరవల్లి నిర్మల ఒంటరిగా గుంటూరు నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీలో ఉంటుంది. ఈ క్రమంలో పిల్లల చదువులు, భవిష్యత్తు అవసరాల నిమిత్తం తనకున్న పొలాలు, ఇళ్ల స్థలాలు విక్రయించి ఆ సొమ్మును తన బ్యాంకు ఖాతాలో జమ చేసుకుంది. సంగడిగుంట ప్రాంతానికి చెందిన సామ్రాజ్యం కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని కేతనకొండకు చెందిన జ్యోతి అనే మహిళను నిర్మలకు పరిచయం చేసింది. జ్యోతి తాను అనేకమందికి బంగారు బిస్కెట్లు విక్రయించానని నిర్మలకు చెప్పింది. ఒక్కో బిస్కెట్ అమ్ముకుంటే లక్ష వరకు లాభం ఉంటుందని చెప్పింది. ఈ విధంగా కొద్దిరోజులు నిర్మలతో స్నేహం కొనసాగించి ముందుగా ఐదు లక్షలు అప్పుగా తీసుకుంది. ఆ తరువాత ఎవరికో తక్కువ ధరకు బంగారం ఇప్పించడం ఎందుకు మనమే బంగారు షాపు పెట్టి వ్యాపారం చేద్దామని ఆరు కోట్లు ఇస్తే రూ.10 కోట్ల ఖరీదైన బంగారం ఇస్తారని, వాటిని షాపు ద్వారా విక్రయిస్తే రూ.20 కోట్ల వరకు సంపాదించుకోవచ్చని నిర్మలకు ఆశ కల్పించింది. ఈ విధంగా మోసపూరిత మాటలు చెప్పి దశల వారీగా ఆమె దగ్గర రూ. 4.5 కోట్లు స్వాహా చేసింది. బాధితురాలు నిర్మల సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు స్పందించిన ఎస్పీ పూర్తిగా విచారించి బాధితురాలికి న్యాయం చేయాలని పట్టాభిపురం పోలీసులను ఆదేశించారు.

యూట్యూబ్.. సైన్స్ మాస్టారు



- లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ పేరుతో ఛానల్
- 4.55 లక్షలకు చేరిన సబ్‌స్క్రైబర్లు
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విశేష ఆదరణ
- తెనాలికి గర్వకారణం రాయపాటి శివనాగేశ్వరరావు మాష్టారు

ఆయన ప్రభుత్వ పాఠశాల సైన్స్ మాష్టారు. 35 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ పిల్లలకు సైన్స్‌ని ప్రయోగాత్మకంగా బోధించేవారు. జనవిజ్ఞాన వేదిక వంటి స్వచ్ఛంధ సేవా సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేవారు. వారిలో ఉన్న అపోహలను తొలగించేవారు. ఏ సంస్థ పిలిచినా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా వెళ్లి లెక్చర్లు ఇచ్చేవారు. అలాంటిది కరోన లాక్‌డౌన్‌లో ఆయన ఇంటికి పరిమితం కావాల్సి వచ్చింది. ఆ సమయంలో పుట్టిన ఆలోచనే లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ యూట్యూబ్ ఛానల్. అనతికాలంలో లక్షల సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకొని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల విశేష ఆదరాభిమానాలు పొందుతున్నారు. ఆయనే మన తెనాలి చెంచుపేటకు చెందిన రాయపాటి శివనాగేశ్వరరావు మాష్టారు.

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక మండలాల్లో రాయపాటి శివనాగేశ్వరరావు మాస్టారు సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహించారు. సర్వీసు ఆఖరులో 9 నెలల పాటు హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహించి ఈ ఏడాది మార్చి 31వ తేదీన గురజాలలో ఉద్యోగ విరమణ చేశారు. కరోన సమయంలో తాను విద్యా బోధనకు దూరమౌతున్నానన్న బాధని ఎలాగైనా అధిగమించాలని తొలుత 2020 ఆగస్టులో తన నివాసంలో ఒక చిన్నపాటి సైన్స్ ల్యాబ్‌ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఎలాగైతే ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాయో శివనాగేశ్వరరావు మాష్టారు కూడా అదే రీతిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించి వారిని లాక్‌డౌన్‌లో చదువుకు దూరం కాకుండా చేశారు.



సీఎం చంద్రబాబు నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకుంటున్న శివనాగేశ్వరరావు

అక్కరకు వచ్చిన ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ

తాను పని చేస్తున్న పాఠశాల విద్యార్థులకే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పిల్లలకు సైన్స్ పాఠాలు ప్రయోగాత్మకంగా బోధించాలన్న ఆలోచన రావడంతో ఆయన లిటిల్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ యూట్యూబ్ ఛానల్‌ని ప్రారంభించాలని నిర్ణయిం చారు. ఇందుకోసం తొలుత ఆయన అప్పటికే యూట్యూబ్ రంగంలో లక్షల మంది సబ్‌స్క్రైబర్లు కలిగిన మెహబూబ్ బాషా, బోధు వెంకట సుబ్బారావులను సంప్రదించి వారి వద్ద సలహాలు, సూచనలు తీసుకొన్నారు. ఉపాధ్యాయుడిగా కాకముందు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఎక్కువ మక్కువ కలిగివుండేవారు. ఆ అనుభవాన్ని వినియోగించుకొని సొంతంగా సైన్స్ ప్రయోగాలపై వీడియోలు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. తొలుత వేరే యూట్యూబర్లకు తాను చేసిన వీడియోలు పంపి ఏమైనా తప్పులు ఉంటే సరి చేయించే వారు. ఆ తర్వాత తనే ఎలాంటి లోపాలు లేకుండా వీడియోలు తీసి అప్‌లోడ్‌చేస్తున్నారు.

షార్ట్ వీడియోలతో అమాంతంగా పెరిగిన సబ్‌స్క్రైబర్లు

2022 డిసెంబరు నుంచి సైన్స్ ప్రయోగాలతో పాటు మరి కొన్ని షార్టు వీడియోలు తీసి అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. అప్పటివరకు 2,400 మంది ఉన్న వీక్షకులు ఒక్కసారిగా పెరగడం ప్రారంభించారు. అనూహ్యంగా స్పందన వచ్చింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే సబ్‌స్క్రైబర్ల సంఖ్య లక్ష దాటిపోయింది. అలా పెరుగుతూ నేడు 4 లక్షల 55 వేల మంది సబ్‌స్క్రైబర్లు శివనాగేశ్వరరావు మాష్టారు వీడియోలు వీక్షిస్తున్నారు. ఇప్పటికే 292 షార్టు వీడియోలను ఆయన అప్‌లోడ్ చేసి సైన్స్‌పై విద్యార్థులకు మక్కువ కలిగేలా చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోగాలపై వీడియోలు చేసి అప్‌లోడింగ్ చేయడానికి సరంజామ, అవసరమైన పరికరాలను ఆయన సమకూర్చుకొంటున్నారు.

విశేష ఆదరణ పొందిన వీడియోలలో కొన్ని

టీ కప్పులతో బెర్‌నౌలీ సూత్రాన్ని శివనాగేశ్వరరావు మాష్టారు కళ్లకు కట్టిన తీరు విశేషంగా యూట్యూబ్ వ్యూస్, లైక్‌లను తెచ్చి పెట్టింది. అలానే సింపుల్ ఎలక్ట్రిక్ మోటారు, యాంటీ గ్రావిటీ వాటర్ ట్రిక్, ఘోస్ట్ ఇన్ ఏ బాటిల్, పేపర్ గ్లైడర్ తయారీ, పీవీసీ పైపు నుంచి మ్యూజికల్ సౌండ్ ఉత్పత్తి, కప్‌లోని నీటితో సెంట్రీఫ్యూగల్ ఫోర్స్, ఎసిటలీన్ ఫ్యూయల్ రాకెట్, స్పిన్నింగ్ రింగ్స్ ఇల్యూషన్, కంప్రెషబుల్ ప్రాపర్టీ ఇన్ సాలిడ్స్ అండ్ లిక్విడ్స్, ఇంద్రధనస్సు రంగులను ఇంట్లో ఎలా తయారు చేయవచ్చు, టిబెటిన్ సింగింగ్ బౌల్ వంటి షార్టు వీడియోలు అమితంగా ఆకట్టుకొంటున్నాయి.





సైన్స్ అనేది బోర్డు మీద చెప్పే సబ్జెక్టు కాదు

సైన్స్ అనేది బోర్డు మీద చాక్‌పీసుతో రాసి చెప్పే సబ్జెక్టు కాదని అంటారు శివనాగేశ్వరరావు మాష్టారు. సైన్స్‌ని ప్రయోగాత్మకంగా చేసి చూపించాలి. ఏదైనా ప్రయోగం నిరూపించబడితేనే అది సైన్స్ అవుతుంది. లేదంటే సూడో సైన్స్ అవుతుంది. ఎలిమెంటరీ పాఠశాల నుంచి ప్రతీ దానిని పిల్లవాడికి అర్థమయ్యేరీతిలో ప్రయోగాత్మకంగా చూపించాలి. అప్పుడే ఆ విద్యార్థిలో ఆలోచన శక్తి పెరుగుతుంది. ప్రయోగాత్మకంగా చెబితే విద్యార్థి ఒంటబట్టించుకొని మంచి శాస్త్రవేత్తగా ఎదగడానికి దోహదపడుతుంది. అప్పుడే కొత్త విషయాలు కనుగొనే శక్తి పెరుగుతుంది. విదేశాల్లో ఎలిమెంటరీ పాఠశాల దశలోనే ప్రయోగశాలలకు విద్యార్థులను పంపుతారు. మనకు అన్ని వనరులున్నా చేయడం లేదు. అందువలనే సైన్స్‌లో మనం వెనకబడిపోతున్నాం.



అమరావతి : క్యూలో స్వామి దర్శనం కోసం బారులు దీరిన భక్తులు



పెదకాకాని : కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



బాపట్ల : సూర్యలంకలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

పూజలు పుణ్యస్నానాలు

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ప్రసిద్ధ ఆలయాలైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి, అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయం, పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయం, బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి భక్తులు పోటెత్తారు. ఆయా ప్రాంతాల్లో స్వామివార్లకు కార్తీక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాస పుణ్య స్నానాలను ఆచరించారు. ఆలయాల నిర్వాహకులు, పోలీసులు కార్యక్రమాలను, శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

- ఆలయాల్లో కార్తీక సోమవారం భక్తుల రద్దీ
- భక్తజనంతో కళకళలాడిన అమరేశ్వరాలయం
- త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం
- కాకాని మల్లేశ్వరుని సన్నిధికి పంచారామ భక్తులు
- సూర్యలంక తీరంలో భక్తుల ప్రత్యేక పూజలు
- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

అమరావతి, నరసరావుపేట, బాపట్ల, పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయం పంచా రామ భక్తులతో కళకళలాడింది. పంచారామాలు ఒకే రోజున సందర్శిస్తే పుణ్యప్రదమని భావించే భక్తులు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుండి ప్రత్యేక బస్సులలో ఆదివారం రాత్రికి అమరావతి చేరుకుని తెల్లవారు జామున పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి నదీతీరంలో, ఆలయ ప్రాంగణములో కార్తీకదీపాలను వెలిగించారు. కొన్నిదీపాలను నదిలో వదలడంతో అమరేశ్వర స్నానఘాట్ దీపాల కాంతిలో వెలుగులు విరజిమ్మింది. అనంతరం స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లలో స్వామివారిని దర్శించుకుని వెళ్లారు. మూడు గంటల పాటు క్యూలు భక్తులతో రద్దీగా మారాయి. కార్తీకమాస ప్రత్యేక అధికారి ఏఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో పోలీసులు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన సహాయ కమిషనర్, కార్య నిర్వాహణాధికారి పీ. సునీల్ కుమార్ ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఆలయ సమీప ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారి, అర్చకులు స్వాగతం పలికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

- కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీ త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసి నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.
- బాపట్ల పట్టణంలోని శ్రీగంగాపార్వతి సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు విచ్చేసి పూజలు జరిపారు. అనేక ఆలయాలలో కార్తీకశోభ ఉట్టిపడింది. సూర్యలంక సముద్రతీరం వద్ద అనేక మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఇసుకతో శివలింగాలు ఏర్పాటు చేసి కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులు తీరం వెంబడి బందోబస్తుతో పాటు గజఈతగాళ్ళతో గస్తీ నిర్వహించే ఏర్పాట్లు చేశారు.
- పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు జరిపించి, స్వామి వారి అన్నప్రసాదములు భక్తులు స్వీకరించారు. నిర్వాహకులు క్యూలలోని భక్తులకు పాలు, మజ్జిగ, మంచి నీళ్ళను ఉచితంగా అందజేశారు. దేవస్థాన ఉప కమిషనరు, కార్య నిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు ఏర్పాట్లను, బందోబస్తును పర్యవేక్షించారు. గుంటూరు జిల్లా కోర్టు 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జిలు నాగ రాజు, శ్రీలత, 6వ ఎంఎం కోర్టు జడ్జీ, ఎంఎ లసీ కల్ప లతా రెడ్డి స్వా మిని ద ర్శించు కు న్నారు.









కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి క్షీరం, పసుపు, గంధం, కుంకుమతో అభిషేకాలు

- 'నూతిలో గొంతుకలు' కవితా సంపుటితో ప్రసిద్ధి
- ఆజన్మ బ్రహ్మచారిగా కవితలకే జీవితం అంకితం
- 'ఆలూరి'కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో జిల్లాకు ఘనత
- ప్రత్తిపాడు హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా సేవలు
- నేడు ఆలూరి బైరాగి జయంతి

మానవతా వాది ఆలూరి బైరాగి



గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, కథా రచయిత ఆలూరి బైరాగి జిల్లాకే గర్వకారణం. ఆయన గొప్ప మానవతా వాదిగా వినతికెక్కారు. 'నూతిలో గొంతుకలు' అనే కవితా సంపుటితో ఆయన ప్రసిద్ధి చెందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో ఆయన పేరు దేశవ్యాప్తమైంది. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఐతానగర్‌కు చెందిన ఆలూరి బైరాగి జయంతి సందర్భంగా పలువురు కవులు, కథా రచయితలు స్మరించుకుంటున్నారు. ఐతానగర్‌కు చెందిన ఆలూరి వెంకటరాయుడు, సరస్వతి దంపతుల కుమారుడు ఆలూరి బైరాగి 1925, నవంబరు 5న జన్మనించారు. బైరాగి ఆజన్మచారిగా ఉన్నారు. మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన బైరాగి రెండో తరగతి వరకు తెలుగు మీడియంలోనే చదువుకున్నారు. ఆయన తండ్రి వెంకటరాయుడు దేశ భక్తుడు. తండ్రి హిందీ చదవమని ప్రోత్సహించటంతో 1935 ప్రాంతాల్లో యలమంచిలి వెంకటప్పయ్య స్థాపించిన హిందీ పాఠశాలలో చేరారు. 13వ ఏట హిందీలో ఉన్నత విద్య అభ్యసించటానికి ఆయన ఉత్తరాది వెళ్ళారు. 15వ ఏటలోనే ఆయన హిందీలో కవితలు రాసి కవి సమ్మేళనాల్లో పాల్గొనటం విశేషం. బైరాగి కవితా వ్యాసంగపు తొలినాళ్ళలోనే పలాయన్ అనే పేరుతో హిందీ కవితా సంకలనం ప్రచురించారు. తండ్రి అడుగు జాడల్లో 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. ఆ తరువాత ఎమ్ఎన్ రాయ్ నెలకొల్పిన రాడికల్ డెమోక్రాటిక్ పార్టీకే అంకితమయ్యారు. స్వతహాగా ఆంగ్లం నేర్చుకొని ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. 1946లో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడుగా చేరారు. బైరాగి బహుబాషా కోవిదుడు కూడా. ఆయనకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు బాషలతో పాటు బెంగాలి, ఉర్దూ భాషలలో కూడా ప్రవేశం పొందారు.

హిందీ చందమామకు సంపాదకత్వం

బైరాగి పినతండ్రి చందమామ వ్యవస్థాపకులలో ఒకరైన చక్రపాణి (ఆలూరి వెంకటసుబ్బారావు) హిందీ చందమామకు సంపాదకత్వం వహించమని కోరటంతో మకాం మద్రాసుకు మార్చారు. హిందీ చందమామలో పిల్లల కోసం చిట్టి పొట్టి కవితలు. కథలు రాశారు. తొలి నుంచి స్వేచ్ఛాజీవి అయిన బైరాగి చందమామలో కొనసాగలేక బయటకు వెళ్ళిపోయారు. తెలుగులో బైరాగి మొదటి కవితా సంకలనం చీకటి నీడలు ప్రచురించారు. నూతిలో గొంతుకలు, దివ్యభవనం కథా సంపుటిని ప్రచురించారు. బైరాగి రచనలలో కెల్లా నూతిలో గొంతుకలు ఆయన ఉత్కృష్ట రచన. బైరాగి స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి. ఆయన తన పంథా మార్చుకోవాలని ఎవరైనా సలహాలు ఇచ్చినా నవ్వి ఊరుకునే వారే తప్ప తన భావాలను మార్చుకునే వారు కాదు.

నిరాడంబర జీవితం.....హైదరాబాద్‌లో మరణం

బైరాగి చాలా నిరాడంబరంగా జీవితం గడిపారు. 1978లో క్షయవ్యాధికి గురైన సందర్భంలో మిత్రులు ఎంత చెప్పినా వైద్యం పట్ల ఆసక్తి చూపకపోవడమే ఆయనకు చేటు చేసింది. చివరి రోజుల్లో ఆయన తన మకాం హైదరా బాద్‌కు మార్చారు. ఆంగ్లంలో ఒక మంచి నవల రాశారు. ఆయన నవల, నాటకం, కొన్ని అముద్రితాలుగానే మిగిలిపోయాయి. బెంగాలీ భాష కూడా నేర్చుకున్నారాయన. బెంగాలీలో జీవనానంద దాస్ అనే కవి ఆయనకి చాలా ఇష్టంఅని చెప్పేవారు. ఆజన్మ బ్రహ్మచారి అయిన బైరాగి 54 ఏళ్ళ వయస్సులో 1978 సెప్టెంబరు 9న కన్నుమూశారు. ఆయన మృతితో తెలుగు సాహిత్యంలో ఒక ధృవతార నేల రాలిపోయినట్లయింది. బైరాగి మరణానంతరం 1984లో ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రదానం చేసింది.

నవ్య పద ప్రయోగకర్తగా ప్రత్యేక స్థానం

తెలుగులో నవ్య పదప్రయోగ కర్తగా బైరాగికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయనలో ప్రధానంగా అస్తిత్వ వాదం, సామ్యవాదం కనిపిస్తాయి. ఎమ్ఎన్‌రాయ్ ఆలోచనలు, సిద్ధాంతాల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఫలితంగా అస్థిత్వవాదం నుంచి సామ్యవాదానికి మొగ్గుచూపాడు. ఆయన సాహిత్యంలో ఈ రెండు వాదాలు బలంగా కనపడతాయి. బైరాగి తొలి కవితా సంపుటి 'చీకటి నీడలు' ధ్వంస వాదంతో పాటు పేదల పక్షం వహించడం ఇందులో ప్రధాన కనపడుతుంది.

తొలి కవితా సంపుటి చీకటి నీడలుతో ప్రారంభం

బైరాగి తొలి కవితా సంపుటి 'చీకటి నీడలు'తో ప్రారంభమై అనేక కవితలు ఆయన కలం నుంచి జాలువారాయి. 'ఆగమగీతి'కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. నూతిలో గొంతుకలు, దివ్య భవనం (కథలు), కాంచన మృగం (రూపకం), పాప పోయింది (నవల) హిందీలో 'నయా కవిత'కూడా రాశారు. హిందీ నుంచి అనేక అనువాదాలు కూడా చేశారు. ఆలూరి బైరాగి అస్తిత్వ వేదన పేరుతో ఆంగ్లంలో రాసిన కవితా సంపుటి ఇందులో 80కు పైగా కవితలున్నాయి.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఔషధ వినియోగం సురక్షిత, సమర్థతపై అవగాహన సదస్సు

తాడికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ప్రీ-క్లినికల్ ఫార్మకాలజీ అండ్ ఫార్మాకో విజిలెన్స్ కార్యక్రమంలో భాగంగా ఔషధ వినియోగం సురక్షిత, సమర్థతపై రెండు రోజుల అవగాహన సదస్సు సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విశ్రాంత సెక్రటరి ప్రొఫెసర్ ఆర్ఎస్ ఠాకూర్ పాల్గొని ప్రసంగించారు. ఔషధ నామకరణం ఒక సమగ్ర ప్రక్రియ, దీని ద్వారా ప్రతి ఔషధం ప్రత్యేకతను నిర్ధారించటమే కాకుండా దాని అభివృద్ధి, నియంత్రణ ఆమోదం, వైద్య వినియోగంలో దాని గుర్తింపు సులభతరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి విరాళం



ప్రిన్సిపాల్‌కు చెక్కు అందజేస్తున్న దాత సుబ్బారావు

పెదనందిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాల అభివృద్ధికి సోమవారం దాత విరాళం అందజేశారు. దాత పీఏఎస్ కళాశాలలోనే స్టోర్ కీపర్‌గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన శాఖమూరి చెంచుసుబ్బారావు రూ.50వేల నగదు చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో పనిచేసి కళాశాల అభివృద్ధికి చేయూతనంచిన దాత చెంచుసుబ్బారావును కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయన(విశ్రాంత ఏఎస్పీ), సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లావు రత్తయ్య, కమిటీ సభ్యులు, అభినందించారు.

405 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 405బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠ ధర రూ.11,280, మోడల్‌ధర రూ.11,280 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,400, మోడల్ ధర రూ.11,400 పలికాయి.

రోడ్ల మరమ్మతులు ముమ్మరం



గౌతమబుద్ధ రోడ్డుపై గుంతలను పూడుస్తున్న సిబ్బంది

మంగళగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో రోడ్ల మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం గుంతలమయమైన రహదార్లకు మరమ్మతులు చేసే పనిలో నిమగ్నమైంది. మంగళగిరి పట్టణంలో ప్రధాన రహదారియైన గౌతమ బుద్ధ రోడ్డుతోపాటు పురవీధుల్లో గుంతలు పూడ్చే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

7న ఎన్‌జీ రంగా జయంతి ఉత్సవాలు

తాడికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి ఉత్సవాలను ఈనెల 7వ తేదీన రంగా ట్రస్టు, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్నట్లు లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ సోమవారం తెలియజేశారు. ఎన్‌జీ రంగా జయంతి ఉత్సవాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లు పాల్గొంటారని తెలియజేశారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

తాడికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ఆధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రకటించిన రూ.20 వేలు వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యాదర్శి పచ్చల శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం తాడికొండ మండలంలోని తాడికొండ, ఫణిదరం, దామరపల్లి, పొన్నెకల్లు, గుంటూరు రూరల్ గ్రామాలైన జొన్నలగడ్డ, అడవితక్కెళ్లపాడు గ్రామ కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేశారు.

ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం

కాకుమాను, నవంబరు 4: కాకుమాను వెలుగు కార్యాలయంలో సోమవారం నిరక్షరాస్యులకు విద్యను అందించే ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం ఏపీఎం సుజాత్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా డీఏఈవో జగన్మోహన్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యుగకీర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా బ్రహ్మనాయుడు

పెదనందిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐగా బ్రహ్మనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఫిరంగిపురంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

దుగ్గిరాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెనుమూలిలో టీడీపీ సభ్యత్వ నమోదుకు సోమవారం శ్రీకారం చుట్టినట్లు టీడీపీ గ్రామ అధ్యక్షుడు మద్దుకూరి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో గతంలో నమోదు చేయబడి వాటిని 86 మందివి రెన్యువల్ చేయగా, కొత్తగా 75మందికి సభ్యత్వాలు ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. నాయుడు సీతయ్య, కొరిటాల భాస్కరరావు, జోగారావు, రాజశేఖర్, ఎం వెంకటసుబ్బయ్య, పాటిబండ్ల రాజా, కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో భక్తులకు అన్న సంతర్పణ

మంగళగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అన్న సంతర్పణ చేశారు.

సమస్యల పరిష్కారమే ఎజెండాగా ప్రజాదర్బార్

- ఇప్పటివరకు 45 ప్రజాదర్బార్‌ల నిర్వహణ
- ప్రజల నుంచి 4,753 విజ్ఞప్తులు.. 2,219 పరిష్కారం
- వాటిలో సగానికి పైగా రెవెన్యూ, హోం శాఖలవే
- స్వయంగా అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్



ప్రజాదర్బార్‌లో దివ్యాంగుడి వద్దకు వచ్చి అర్జీ స్వీకరించి పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్ (ఫైల్‌ఫొటో)

మంగళగిరి, తాడేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ సమస్యల పరిష్కారమే ఏజెండాగా సాగుతోంది. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా.. ఆపద ఎదురైనా ప్రజా దర్బార్‌కు వస్తే తమ సమస్యలకు పరిష్కారం లభించినట్టేనని ప్రజలు విశ్వసిస్తున్నారు. తొలుత మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేయగా... క్రమంగా రాష్ట్రం నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చి మంత్రి లోకేశ్ ఎదుట తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. వారి ఆవేదన, బాధను సావధానంగా ఆలకిస్తున్న లోకేశ్ సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగానికి తగిన ఆదేశాలిస్తున్నారు.

ప్రజాదర్బార్‌లో ఇప్పటివరకు 4,753 అర్జీలను మంత్రి లోకేశ్ స్వీకరించారు. వాటిలో 2,219 సమస్యలకు పరిష్కారం లభించింది. విజ్ఞప్తుల్లో సగానికి పైగా భూ వివాదాలు, హోం శాఖకు సంబంధించిన సమస్యలే ఉన్నాయి. ఆ తరువాత పురపాలక శాఖ, పాఠశాల విద్య, ఇళ్ల నిర్మాణం, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. వీటితో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ అదనంగా 863 మంది ప్రజాదర్బార్ ద్వారా విన్నవించారు. ఆయా విన్నపాల్లో మొదటి విడతగా 350 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. వీరికి త్వరలోనే నియామక పత్రాలను కూడా అందించనున్నారు.

గత వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సమస్యలతో ప్రజలు సతమతమైనా వారి గోడును పట్టించుకున్న నాథుడు లేడు. ఐదేళ్లపాటు సమస్యలు పరిష్కారం కాక సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. కష్టాలు చెప్పుకుందామని తాడేపల్లి ప్యాలెస్‌ను చేరుకున్న బాధితులను నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటివేసిన సందర్భాలు అనేకం. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేర రోడ్డును బ్లాక్ చేసి బారికేడ్లు, పరదాలతో ప్యాలెస్ చుట్టూ ప్రజలను నిలువరించారు. ప్రజాగ్రహానికి గురైన వైసీపీ ప్రభుత్వం భారీ ఓటమిని చవిచూసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు స్వేచ్ఛ లభించింది. ఐదేళ్లలో తాము పడిన బాధలు చెప్పుకునేందుకు ఉండవల్లిలోని మంత్రి నారా లోకేశ్ నివాసానికి ఉదయం నుంచే ప్రజలు బారులు తీరుతున్నారు. అక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఆంక్షలు, సెక్యూరిటీ నిబంధనలు లేకపోవడంతో స్వేచ్ఛగా తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు చెప్పుకుంటున్నారు.

ప్రజల కోసం తమ ఇంటి ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మంత్రి లోకేశ్ నిలబెట్టుకున్నారు. మంగళగిరి నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకుంటున్న ప్రజలను లోకేశ్ స్వయంగా కలుసుకుని, వారిని ఆప్యాయంగా పలుకరిస్తూ వినతులు స్వీకరిస్తున్నారు. సమస్యలపై అప్పటికప్పుడే సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రజాదర్బార్‌లో ఉదయం 8 నుంచి పది గంటల వరకు అందుబాటులో ఉంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వివిధ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు సైతం ఆయా జిల్లాల్లోనే ప్రజాదర్బార్‌లు నిర్వహించి రాష్ట్ర వ్యాపితంగా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు లోకేశ్ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. విజ్ఞప్తులను శాఖల వారీగా విభజించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రతి కేబినెట్ సమావేశంలో అప్పటివరకు తాను స్వీకరించిన విజ్ఞప్తులను మంత్రులకు అందజేస్తున్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిబ్బంది సంబంధిత శాఖలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తీక సోమవారం నాడు ప్రత్యేక పూజలు



మంగళగిరి శివాలయంలో కార్తీక దీపారాధన చేస్తున్న మహిళలు

మంగళగిరి సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో మంగళగిరి పట్టణంతోపాటు మండలంలోని శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కార్తీక దీపారాధనలతో ఆలయాలు దేదీప్య మానంగా వెలుగొందాయి. శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మంగళగిరి పట్టణంలో రెండు వైష్ణ వాలయాల నడుమన ఉన్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానానికి సోమవారం వేకువజాము మూడు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ఉదయం, సాయంకాల వేళల్లో శివాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలి గించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. మహిళలు రోజంతా ఉపవాస దీక్షలను ఆచరించి భక్తిశ్రద్ధలతో పరమ శివుడ్ని పూజించారు. శివాలయం ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం, ఘాట్ రోడ్డులోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



వట్టిచెరుకూరులో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

- దుగ్గిరాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. కార్తీకమాసం తొలి సోమవారం తెల్లవారు జాము నుంచే భక్తులు శివాలయాలకు తరలివచ్చారు. సాయంత్రం ధ్వజస్తంబాల వద్ద దీపాలను వెలిగించారు.
- వట్టిచెరుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ప్రారంభమై తొలి సోమవారం సందర్భంగా మహిళలు తెల్లవారుజామునే ఆయా ప్రదేశాల్లో స్నానాలు ఆచరించి దీపారాధనలు చేసుకొని ఆలయాలకు చేరుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చెరువు వద్ద మహిళలు స్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు.

8న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

- మూడు విభాగాల్లో పోటీలు

గుంటూరు(విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువతీ, యువకుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 8వ తేదీ జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి, యువజన సంక్షేమశాఖాధికారి టీడీ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో 15 నుంచి 19 సంవత్సరాల యువతీ, యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఇందులో థీమాటిక్ విభాగంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టులు ప్రదర్శించవచ్చునని తెలిపారు. కల్చరల్ విభాగంలో గ్రూపు ఫోక్‌డ్యాన్స్, గ్రూపు ఫోక్‌సాంగ్స్ సోలో ఫోక్‌సాంగ్, సోలో ఫోక్‌డ్యాన్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. లైఫ్ స్కిల్స్ విభాగంలో పోయట్రీ, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్(ప్రకటన) విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంట్రీలు https://bit.ly/dyfguntur24 అనే వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 0863-2234176, 9398693990లో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో నైపుణ్య గణన చేపడతాం

- ఎంపీడీవో చందన

మేడికొండూరు నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో నైపుణ్య గణన చేపడతామని ఎంపీడీవో తోట చందన చెప్పారు. మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందికి సోమవారం నైపుణ్య గణనసేకరణపై శిక్షణ నిర్వహించారు. 15-59 సంవత్సరాల మధ్య ఉన్న వ్యక్తుల నైపుణ్యాన్ని గుర్తించడంతో పాటు వారి ఆకాంక్షలు కూడా సర్వేలో తెలుసుకుంటారని అన్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వస్తారని, అవసరమైన సమాచారం అందించి సర్వేకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఇందుకు సంబంధించి నైపుణ్య గణన యాప్‌పై వినియోగంపై సచివాలయ సిబ్బందికి యూఎస్‌డీవో రఫీ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ , సచివాలయ ఉద్యోగులు శిక్షణలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

తాడేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, ప్రాతూరు సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు యాజమాన్యం సదరు ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించి తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు వారం క్రితం ఉపాధ్యాయుడు పాఠశాలలోని ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించగా సదరు విద్యార్థిని ఈ విషయాన్ని తలిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లింది.

కొండపై నుంచి జారిపడి ఒకరి మృతి

మేడికొండూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పేరేచర్ల సమీపంలో కొండపై నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కమలాపురంనకు చెందిన మణికృష్ణన్ (49) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం పేరేచర్లకు వచ్చి క్రషర్‌లో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. సోమవారం క్రషర్ సమీపంలోని కొండపైకి ఎక్కేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు జారి కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో మణికృష్ణన్ తలకు గాయాలు కాగా గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటి తరువాత మరణించాడు. ఈ మేరకు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదనపుకట్నం కోసం వేధింపులపై కేసు

దుగ్గిరాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతలపూడికి చెందిన గౌరిబోయిన లక్ష్మి తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ దుగ్గిరాల పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. శేకూరు గ్రామానికి చెందిన గౌరి బోయిన శ్రీనివాసరావుతో ఏడాది క్రితం వివాహం జరిగింది. కాగా ఇటీవల అదనపు కట్నం కోసం తనను వేధింపులకు గురిచేస్తున్నాడని లక్ష్మి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

పేదల కళ్లల్లో ఆనందం కోసమే టీడీపీ కృషి

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



ఫిరంగిపురంలో టీడీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభి స్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్న ఆశయం కోసమే పని చేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం ఫిరంగిపురంలో పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో మండలంలో టీడీపీ మెజార్టీ సాధించటం అభినందనీయమన్నారు. క్రమశిక్షణ గల సైనికులుగా పని చేస్తున్నారని ఆయన తెలిపారు. పార్టీ సభ్యత్వాలు, ఎమ్మెల్సీ ఓట్ల కోసం కలసికట్టుగా పనిచేసి రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించాలని ఆయన కోరారు. కార్యకర్తలు నాయకత్వాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. పారిశ్రామిక విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. పేదల సంక్షేమం ఈ ప్రాంత గ్రామాల అభివృద్ధికి బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అరమరికలు లేకుండా పాటు పడతామని ఆయన తెలిపారు. మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కార్యకర్తలంతా సమష్టి కృషి చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ మండల బీజేపీ కార్యాలయం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య కొత్తపల్లి కోటేశ్వర రావు, ఆళ్ళ కృష్ణమూర్తి, చెక్కా హనుమంతరావు, మహమ్మద్ యాకూబ్, కే యోహాన్, పీ హృదయరాజు, పసల థామస్, కటికల రామకోటేశ్వరరావు, కే అప్పారావు, నలజర్ల అప్పయ్య, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన పాలడుగు క్రీడాకారులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం తదితరులు

మేడికొండూరు నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచే క్రీడల్లో విద్యార్థులందరూ పాల్గొని రాణించాలని పాలడుగు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరకొండ వెంకటేశ్వర్లు చెప్పారు. ఇటీవల ముగిసిన అండర్ 17, అండర్ 14 ఫుట్‌బాల్, హాకీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన కనుమూరి అఖిల్ (ఫుట్‌బాల్), గుడిపూడి కుసుమ, గుడిపూడి సంతోష్ (హాకీ)లు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. వీరిని అభినందించేందుకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కరీముల్లా రావు చౌదరి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. ఆయా క్రీడల్లో అత్యుత్తమ కనబరిచి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

మంగళగిరి సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించబడిన కార్మిక బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేయ డంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొత్త సంస్కరణ తెచ్చినప్పటికీ ఇసుక అందుబాటులోకి రాకపోవడం వల్ల ప్రజలు, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో ఉన్న ఇసుక ధరకు, ఇప్పుడున్న ఇసుక ధరకు తేడా ఏమీ లేదన్నారు. దీంతో భవన నిర్మాణాలకు సంబంధించిన 32 రకాల వృత్తుల వారు ఉపాధి కోల్పోయి అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన గుంటూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నేతలు అన్నవరపు ప్రభాకర్‌రావు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల దీక్ష శిబిరం ప్రారంభం

తాడేపల్లి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ సిమెంటు కార్మికులు తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం చేస్తున్న పోరాటం ఉధృతం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల దీక్షా శిబిరాన్ని అంబేద్కర్ విగ్రహం ముందు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ప్రారంభించారు. యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన జరిగిన సభలో శివశంకర్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన పోరాటానికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కరపత్రాలు విడుదల చేశారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

పెదనందిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పట్టభద్రులంతా ఓట హక్కుకు నమోదు చేసుకోవాలని టీడీపీ నాయకులు నల్లపనేని శివప్రసాద్ అన్నారు. స్థానిక పీఏసీఎస్ కళాశాల రోడ్డు సోమవారం ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఆధార్, ఓటరు కార్డు, డిగ్రీ ప్రొవిజన్ సర్టిఫికెట్‌తో ఓటును నమోదు చేసుకోవాలని, నమోదు కేంద్రం వద్ద రెండు రోజులపాటు అందుబాటులో ఉంటామని స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'పొలం పిలుస్తుంది'తో రైతులకు మేలు

వ్యవసాయాధికారి బి.సుధారాణి

ఫటాఫట్



పెదనందిపాడు, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి బి.సుధారాణి తెలిపారు. ఆమె ఆంధ్రజ్యోతికి వెల్లడించిన పలు అంశాలు.

ప్ర: ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఎంత?

జ: మండలంలో ఖరీఫ్ సీజనులో మినుము 689 ఎకరాలు, మిరప 931, ప్రత్తి 1231, మొక్కజొన్న 20, వరి 362, ఇతర పంటలు 105 ఎకరాల్లో సాగుచేశారు.

ప్ర: పంట నమోదు ఎంత శాతం పూర్తయింది?

జ: మండలంలో ఖరీఫ్‌లో నూరుశాతం పంట నమోదు పూర్తి చేశాం. ఈకేవైసీ 97శాతం పూర్తిచేశాం. మరో మూడు శాతం త్వరలో పూర్తిచేస్తాం.

ప్ర: ఎంత మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేశారు?

జ: మండలంలోని గ్రామాల్లో రైతు సభలు నిర్వహించి కౌలురైతు గుర్తింపు కార్డులమీద అవగాహన కల్పించాం. 2850 మందిని గుర్తించి వారికి కౌలురైతు గుర్తింపు కార్డులు జారీ చేశాం.

ప్ర: రైతులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జ: రైతులకు 'పొలంబడి' ద్వారా ప్రతి గురువారం పెట్టుబడులు తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. పత్తి పంట రైతులకు సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా 50శాతం సబ్సిడీతో దోమల నివారణకు అట్టలు, రెక్కల పురుగుల శాతాన్ని పరిశీలించేందుకు లింగాకర్షణ బుట్టలను ఇస్తున్నాం.

ప్ర: రసాయన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

జ: మండలంలోని పెదనందిపాడు, పుసులూరు గ్రామాల్లో జీడీసీఎంఎస్ కేంద్రాల్లో, డీలర్ల వద్ద డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

చలపతి అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు పొందిన అధ్యాపకులను సన్మానిస్తున్న చలపతి కళాశాలల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు, అధ్యాపకులు

తాడికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలోని నలుగురు అధ్యాపకులకు ఉత్తమ అధ్యాపక కేటగిరిల్లో అవార్డులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో అవార్డులు పొందిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ రీసెర్చ్ అకాడమీ ప్రతి సంవత్సరం ఉత్తమ అధ్యాపకుల కేటగిరిల్లో అవార్డులు ప్రదానం చేస్తుందన్నారు. హెచ్‌వోడీ కేటగిరిలో వూట్ల వెంకట సుబ్బారావు, ప్రొఫెసర్ వీ సాయి శ్రీనివాస్‌లను ఉత్తమ అధ్యాపక కేటగిరిలో పీ నాగమల్లేశ్వరరావు, డీ లావణ్యలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇంజనీరింగ్, ఉన్నత విద్యారంగంలో అకడమిక్ రీసెర్చ్ రంగాల్లో వీరు చేసిన కృషికి గుర్తింపుగా గ్లోబల్ రీసెర్చ్ అకాడమీ అవార్డులు ప్రదానం చేసినట్లుగా తెలిపారు. అవార్డులు పొందిన అధ్యాపకులకు కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు డైరెక్టర్ డీ వినయ్‌కుమార్, డీన్ తదితరులు అభినందించారు.



తాడేపల్లిలోని 'అపర్ణ అమరావతి వన్' గేటెడ్ కమ్యూనిటీలో కార్తీక దీపోత్సవం

పింఛన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. పెన్షన్లను పంపిణీ చేయలేదని లాం గ్రామానికి చెందిన కె.సామ్రాజ్యంను తొలగించారని, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామానికి చెందిన అక్కమ్మకు నోటీసులు జారీ చేశారని తక్షణమే సస్పెన్షన్, మెమోలు రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రేమకుమారి, లలిత, ప్రవీణ బేగం, విజయదుర్గ, సామ్రాజ్యం తదితరులున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికై సీపీఎం ప్రజాపోరు

మంగళగిరి సిటీ, తాడేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజాపోరు ప్రచా రోద్యమం నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ఎస్ చెంగయ్య, రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో, ఉండవల్లిలోని సీపీఎం రాజధాని డివిజన్ కమిటి కార్యాలయంలో సోమవారం ప్రజాపోరు కరపత్రాలను ఆవిష్కరించారు. మంగళగిరి పట్టణంలో ఈ నెల 12, 13 తేదీల్లో ప్రజాపోరు జరుగుతుందన్నారు. 14న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని చెప్పారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రజాపోరు ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వీసం జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుల్తానాబాద్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుల్తానాబాద్, ఇండస్ట్రియర్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈడీ డి.అశోక్‌కుమార్ తెలిపారు. టవర్‌లైన్ పనుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జోన్ డైరీ

● తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని సచివాలయ సిబ్బందికి ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వే 2024 శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ పురపాలక సంఘ కమీషనర్ బండి శేషన్న సోమవారం ఒక ప్రకటణలో తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని పట్టణలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తామని తెలిపారు.

8న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

గుంటూరు (విద్య), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువతీ, యువకుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 8వ తేదీ జిల్లా యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, యువజన సంక్షేమశాఖాధికారి టీవీ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఎంట్రీలు dyfguntur24అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0863-2234176, 9398693990లో సంప్రదించాలని సూచించారు.

రత్నాకర్‌కు నేషనల్ ఆర్ట్ ఫెస్ట్ సత్కారం

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాహిత్యవేత్త ఒంగోలు నేషనల్ ఆర్ట్ ఫెస్ట్ సత్కారం అందుకున్నారు. చిత్రకళా రంగంలో సేవలు అందిస్తున్న ఆయన ప్రతిభను గుర్తించిన సంస్థ అంబేద్కర్‌భవన్‌లో ఆదివారం జాతీయ చిత్రకళ ప్రదర్శన పోటీలు నిర్వహించారు.

ఆలపాటి విజయం కోసం ప్రచారం

తెనాలి రూరల్, నవంబరు 04(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించాలని నాగబాలాజీ ఆకాంక్షించారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ నాగార్జున సాగర్‌కు చెందిన ప్రత్తిపాటి నాగ బాలాజీ జిల్లాలోని పలు నియోజవర్గాల్లో బైక్‌ను ప్రచారరథంగా మలుచుకుని ఆలపాటిని గెలిపించాలంటూ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం తెనాలి విచ్చేసిన ఆయనను టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు సాదరంగా ఆహ్వానించి దుశాలువాలతో సత్కరించారు.

పేదలను ఆదుకోవాలి: తహసీల్దార్

కొల్లిపర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలను ఆదుకోవడం మానవ ధర్మమని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయం అవరణంలో కృష్ణానది వరదకు దెబ్బతిన్న నిరుపేదప్రజలకు రెడ్‌క్రాస్, ముక్తి ట్రైబల్ స్కూల్ ఆధ్వర్యంలో అందజేసిన మిక్సీలను పాస్టర్లులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి శ్రీమన్నారాయణ, హైదరాబాద్‌కు చెందిన ఫాదర్స్ బెన్సీ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిర్లక్షంగా వాహనాన్ని నడిపి తన కారును ఢీ కొట్టాడని అందిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం త్రీటౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్ర తెనాలి నుంచి గుంటూరు వెళ్తున్న కారును చెంచుపేట వద్ద వెనుక నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ కారును ఢీకొట్టాడు. దీనిపై సోమవారం కారు యజమాని సుష్మ ఇచ్చిన పిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పౌష్టికాహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని పట్టణ టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ పి రాధిక అన్నారు. స్థానిక నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను టీబీ యూనిట్ అధికారులు దాతల సహకారంతో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వర్సిటీ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడిగా వెంకటేష్ నియామకం

పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యక్షుడిగా కె.వెంకటేష్‌ను నియమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ సోమవారం తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీలో వెంకటేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా కిషోర్, ఉపాధ్యక్షులుగా మహేష్, గణేష్, ట్రెజరర్ హర్షలకు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తన్నకుమార్, తిరుపతి జిల్లా గార్లపాటి శ్రీధర్, బీసీఎస్ఎఫ్ అధ్యక్షులు రామకృష్ణ, పరిశోధకులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలోని డ్రోన్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అమరావతి డ్రోన్ హెకాథాన్-2024లో పాల్గొన్న వారికి సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు ప్రశంసాపత్రాలను అందజేశారు.

శిథిల భవనాల్లో విధులు



● 1930లో బ్రిటీష్ పాలన నాటి నిర్మాణాల్లోనే భయం భయంగా బాధ్యతలు

● పెచ్చులూడిన శ్లాబులు, వాన నుంచి రక్షణకు పరదా పట్టలతో అవస్థలు

● నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు, ఉద్యోగుల డిమాండ్

మొక్కలు మొలిచి అధ్వానంగా ఉన్న పాత గవర్నమెంట్ ఆసుపత్రి

తెనాలి క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవి బ్రిటీష్ కాలం నాటి భవనాలు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. అయినా ప్రభుత్వ కార్యాలయాలు అందులోనే నిర్వహించుకోవాల్సి రావడం ఇబ్బందికరంగా ఉన్నా తప్పనిసరి అయ్యింది. తెనాలిలో 1930 -33 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం పట్టణ నడిబొడ్డున ఒకే వీధిలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. పాత గవర్నమెంట్ ఆసుపత్రి, రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఫైర్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, కోర్టు భవనాలు, ఆర్డీవో కార్యాలయం, సబ్ జైలు, పోలీసుల క్వార్టర్స్ ట్రెజరీ కార్యాలయం వాటికి విశాలమైన స్థలాలు కేటాయించి ప్రజలకి అందుబాటులో ఉండేలా ఒకే మార్గంలో నిర్మించారు. ఈ 95 సంవత్సరాలలో ఈ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడిపోయిన కార్యాలయ శ్లాబ్‌లతో ఎండ, వానకి సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఉప్పిరిగిన గోడ నుంచి నాచువాసన మరో పక్క పైళ్లకు పడుతున్న చెదలతో రోజువారీ కార్యకలాపాలతో ఉద్యోగులు నెట్టుకొస్తున్నారు. పాత ప్రభుత్వ ఆసుపత్రిని తరలించిన ఆ పాత భవనాలు ఖాళీగా ఉంచడం ఎందుకు అనుకున్నారో ఏమో సరైన వసతులు లేకపోయినా ఏకంగా ఏడు ప్రభుత్వ ఆఫీసులు, వార్డు సచివాలయాలు రెండు, డీఎంహెచ్‌వో, డివిజన్ సహకార శాఖ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం మలేరియా శాఖలు ఈ భవనాల్లోనే కుక్కారు. దీనితో ఉద్యోగులకు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రాష్ట్రంలో బందరు తరువాత రెండో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తెనాలిలోనే నిర్మించారు. ఇప్పుడు ఆ భవనాలు పూర్తిగా శ్లాబులు దెబ్బతిన్నాయి. గదుల్లో వర్షం పడకుండా పరదా పట్టాలతో కప్పుకుని కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ నూతన భవన నిర్మాణ ప్రతిపాదనలు పైళ్లకే పరిమితం అయ్యింది. తహసీల్దార్ కార్యాలయం, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, రెండో అదనపు కోర్టు భవనాలు అలంకారప్రాయంగా మిగిలాయి. వర్షాలు పడకుండా తారుపట్టా కప్పారు. వర్షాకాలం గోడల నుంచి వచ్చే చెమ్మ, దుర్వాసనకు ముక్కు మూసుకోకతప్పదు. వర్షం వస్తే ఇక ఇబ్బందులు సరేసరి. కోర్టు భవనాలు, ఆర్డీవో కార్యాలయం కూడా బ్రిటీష్ వారు కట్టినవే. ఇక్కడ విశాలమైన స్థలాలు ఉన్నా శిథిలమైన భవనాలలో ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు. ఇక 110 సంవత్సరాల క్రితం బ్రిటీష్ వారు నిర్మించిన సబ్ జైలును పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో రూ.4.50 కోట్లతో నూతన భవనాలు నిర్మించాలని రెండుసార్లు శంకుస్థాపనలు చేశారు. నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఎనిమిది నెలలుగా పునాదులకే పరిమితం అయ్యింది. బ్రిటీష్ వారు నిర్మించిన ఫైర్‌స్టేషన్ కూడా ఇదే దుస్థితి. దశాబ్దకాలం క్రితం ఇక్కడ నూతన భవనాలు నిర్మించాలని నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎక్కడ తేడా వచ్చిందోగాని ఇది కూడా పిల్లర్లకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం రేకుల షెడ్డుల్లో ఫైర్‌స్టేషన్ కొనసాగుతోంది. ఎంతో విలువైన స్థలంలో ఉన్న శిథిలమైన పోలీస్ క్వార్టర్స్ కీకారణ్యంగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. తెనాలిలో ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలన్నీ అప్పటి బ్రిటీష్ వారు కట్టిన భవనాలే పెద్ద దిక్కుగా ఉన్నాయి. ఇప్పటి అవసరాలకు తగ్గట్లుగా ప్రభుత్వ ఆఫీసులు నిర్మాణాలకు ఈ 60-70 సంవత్సరాలలో ఏ ప్రభుత్వం ముందుకు రాకపోగా చేపట్టిన సబ్‌జైలు, ఫైర్‌స్టేషన్ వంటి నూతన నిర్మాణాలు పునాదులకే పరిమితం అయ్యాయి. మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలయితే ఏళ్ల తరబడి అద్దె భవనాలకే పరిమితం అయ్యాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శిథిలమైన అలనాటి బ్రిటీష్ నిర్మిత భవనాలు తొలగించి నూతన భవనాలు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు.



పట్టాలు కప్పి ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయం





పునాదులకే పరిమితం అయిన సబ్ జైలు, ఫైర్‌స్టేషన్ నిర్మాణ పనులు

ఘనంగా కార్తీక సోమవారం పూజలు





రామలింగేశ్వరపేటలో దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, మారీసుపేట శివాలయంలో చంద్రమౌళేశ్వరస్వామి



కొల్లిపర శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్తీక మాసం పురస్కరించుకుని తొలి సోమవారం పూజాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పలు శైవ క్షేత్రాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో వేకువజాము నుంచే కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకాలు జరుపుకున్నారు. గంగానమ్మపేటలోని పరశురామ ప్రతిష్ఠిత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలోని తోట ప్రాంగణంలో భారీగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు ఏర్పాటుచేసిన క్యూలైన్లలో వేచిఉండి దర్శనం చేసుకున్నారు. మారీసుపేట శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీశైల భక్త సేవా సమితి ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేట శివాలయంలో పూలతో శివలింగాకృతిని ఏర్పాటు చేశారు. శివలింగాకారంలో దీపాలంకరణ చేశారు. సమితి అధ్యక్షుడు ఆళ్ల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి గోవర్ధన్, బ్రహ్మానందగుప్తా, సుధాకర్, భాస్కర్, వేణుగోపాల్, సత్యనారాయణ, శాంతకుమారి, కృష్ణ పాల్గొన్నారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వేకువజామునే కృష్ణానదిలో స్నానాలు చేసి కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయాల్లో పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అనంతరం మహిళలు ఉపవాసాలతో శైవక్షేత్రాలకు వెళ్ళి దీపారాధనలు చేసి పూజలు నిర్వహించారు. కార్తీక మాసం తొలిరోజు కావడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలిరావడంతో శైవక్షేత్రాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రం కొల్లిపరలో గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో, శ్రీ షిర్డిసాయిబాబా మందిరంలో పండితులు కుటుంబరావు, జగన్నాధాచార్యులు, కుమారస్వామి తెల్లవారు జామునుంచే వివిధ అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం విశిష్టత గురించి వివరించారు.



హకీం జానీని సత్కరిస్తున్న ఉమామహేశ్వర్

విద్యార్థులకు బాలసాహిత్యం పుస్తకాలు పంపిణీ

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మారీసుపేటలోని మఠంబజారు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బాలసాహిత్యం పుస్తకాలు పంపిణీ చేశారు. వేజండ్ల వెంకట సుబ్బారావు 90వ జయంతిని సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ వేజండ్ల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విలువలు, నైతికత వంటి అంశాలలో విద్యార్థుల్లో కలిగించాల్సి ఉందన్నారు. బాల సాహిత్యం పుస్తకాలు అందుకు దోహదపడతాయని చెప్పారు. ప్లాస్టిక్ వాడకం మానేయడం, మొక్కలు నాటడం వంటి వాటిలో చిన్నారులకు అవగాహన కల్పిస్తే జీవితాంతం పాటిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా బాల సాహిత్యం పుస్తకాలు అందించిన షేక్ అబ్దుల్ హకీంజానీని సన్మానించారు. గణేష్, పుల్లారావు, శ్రీదేవి, ప్రసాద్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేట 22వ వార్డులో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు పేదలకు దుప్పట్లు, టవల్స్‌ను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ అఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు పాల్గొని పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి డి మురళీకృష్ణ, ఇంటర్ క్లబ్ రిలేషన్ జోనల్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, గుమ్మడి వెంకట నారాయణ, ఎం అర్జున్, ఉపేంద్ర, కిరణ్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

చేబ్రోలు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని శేకూరు గ్రామంలో దీపావళీ పండుగ రోజున జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సిహెచ్ జ్వాల నరసింహారావు కటుంబానికి సోమవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ కార్యకర్తలు ఆర్థికసాయం అందించారు. కోల్పోయిన నరసింహారావును ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



అగ్ని బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

చిత్తశుద్ధితో గ్రామాలాభివృద్ధి: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని గోళ్లమూడిపాడులో సోమవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. ఎంపీ నిధులు రూ.5లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణం, రూ.5లక్షలతో అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ భూమి పూజచేశారు.

తెనాలిలో అద్భుతమైన శిల్పకళ

డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో అద్భుతమైన శిల్పకళ ఉందని, పేరొందిన శిల్పులు ఈ ప్రాంతానికి మంచిపేరు తీసుకు వస్తున్నారని డీఎస్పీ జనార్ధనరావు పేర్కొన్నారు. సూర్య శిల్పశాలలో మేవార్ రాజు రాణా ప్రతాప్‌సింగ్ భారీ విగ్రహాన్ని ఫైబర్ గ్లాసుతో తయారు చేశారు. ఈ విగ్రహాన్ని సోమవారం పరిశీలించారు. శిల్పశాలలో తయారుచేసిన వివిధ విగ్రహాలను తిలకించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. శిల్పి కాటూరి మాట్లాడుతూ, మార్కాపురంలో ప్రతిష్ఠించేందుకు ఈ విగ్రహం ఆర్డర్ వచ్చిందని తెలిపారు. ఇప్పటివరకు ఎంతోమంది రాజులు, రాణుల విగ్రహాలను తయారు చేసి అందించామని, ఈ విగ్రహం చేయలేదనే బాధ తొలగిందన్నారు. అట్లాంటాలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా గతవారం ఆవిష్కరించిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహం కూడా తామే రూపొందించామన్నారు. శిల్పులను విగ్రహ కమిటీ సభ్యులు భవానీసింగ్, ప్రతాప్‌సింగ్, కళ్యాణ్‌సింగ్, అంజన్‌సింగ్‌లు సత్కరించారు. అనుకున్న దాని కంటే విగ్రహం బాగా వచ్చిందని వారు పేర్కొన్నారు.



మహా రాణాప్రతాప్‌సింగ్ విగ్రహం వద్ద డీఎస్పీ జనార్ధనరావు

బీట్‌లను పటిష్టం చేశాం

● టూ టౌన్ సీఐ నిసార్ అహ్మద్



తెనాలి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టూ టౌన్ పరిధిలో రౌడీషీటర్లపై నిఘా విధించి శాంతిభద్రతలు పరిరక్షించేందుకు బీట్‌ను పటిష్టం చేశామని టూ టౌన్ సీఐ షేక్ నిసార్ అహ్మద్ చెప్పారు. టూ టౌన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలు, శాంతి భద్రతల విషయంపై ఆయన ఆంధ్రజ్యోతికి పలు విషయాలను వెల్లడించారు.

ఫటా ఫట్

ప్రశ్న: రౌడీషీటర్లను అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలపై సమాధానం?

జవాబు: టూ టౌన్ పరిధిలో 60మంది వరకు రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో కొంతమంది పనులపై బయటకు వెళ్లిపోయారు. ఉన్న ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచి కదలికలను పరిశీలిస్తున్నాం. క్రమం తప్పకుండా పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం.

ప్ర: ఐతానగర్‌లో చోరీలు మీ దృష్టికి వచ్చాయా?

జ: ఏ చోరీపై ఫిర్యాదు వచ్చినా విచారణ చేస్తాం. మా నోటీసుకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. చోరీలు జరగకుండా నైట్ పెట్రోలింగ్‌ను పెంచాం.

ప్ర: శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: బీట్ సిస్టమ్‌ను పటిష్టం చేశాం. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేసి అనుమానం వస్తే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. బహిరంగంగా మద్యం సేవించే వారిపై కూడా నిఘాపెట్టాం. ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉంటున్నాం.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తహసీల్దార్ కార్యాలయానికి ఆరు అర్జీలు

తెనాలి రూరల్, నవంబరు 4: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో ఐదు భూములకు సంబంధించిన సమస్యలు కాగా ఒకటి ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ కోసమని వెల్లడించారు. నిర్దీత సమయంలోపు అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి మూడు అర్జీలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘంలో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ విభాగానికి ఒకటి, ఇంజనీరింగ్ శాఖకు రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలసి చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయం ఇన్చార్జి ఈవోగా కేబీ శ్రీనివాసరావు

పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం ఇన్చార్జి ఈవోగా గుంటూరు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు సోమవారం బాధితులు చేపట్టారు. ప్రస్తుత ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ వ్యక్తిగత సెలవుపై వెళ్లినందున కేబీ శ్రీనివాసరావును ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారిగా కమిషనర్ నియమించారు. దీంతో ఆయన ఇన్చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు చేపడుతున్న కేబీ శ్రీనివాసరావు

తెనాలిలో ఆక్రమణల తొలగింపు

తెనాలి, మారీసుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. స్థానిక చెంచుపేటలో సోమవారం రోడ్లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ షాపులను మున్సిపల్ అసిస్టెంటు సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ పర్యవేక్షణలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశాలతో రోడ్లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తున్న షాపులను తొలగిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛందంగా తొలగించాలని వారికి మూడు రోజుల ముందుగా నోటీసులు ఇచ్చామని అయిన తొలగించకపోవడంతో మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తున్నామన్నారు. ఎవరు రోడ్డు మార్జిన్లను ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని హెచ్చరించారు. త్రీటౌన్ పోలీసు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీవో సాంబశివరావు, మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

దూరవిద్య పరీక్షల్లో విస్తృత తనిఖీలు

పెదకాకాని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో కర్నూలు జిల్లాలో జరుగుతున్న దూరవిద్య పరీక్ష కేంద్రాలను ప్రత్యేక పరిశీలక బృందం సోమవారం తనిఖీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గూడూరు పట్టణంలో శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాలలో యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. పరీక్ష నిర్వాహకులు పలు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. వర్సిటీ దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ దృష్టికి తీసుకువెళ్లగా అవకతవకలకు పాల్పడిన సెంటర్‌ను దగ్గరలో ఉన్న మరో సెంటర్‌ను మార్చాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో గూడూరు శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని రద్దు చేశారు.



మృతుడికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

మృతుడికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని 8వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గర్నెపూడి కుమార్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. కుమార్ మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ క్యాబిన్‌పేట వెళ్లి కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. పొన్నూరు పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు నివాళి అర్పించారు.

పెదపాలెంలో టీడీపీ నేతల నివాళి

పొన్నూరు టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తలసిల శివయ్య సోమవారం మృతి చెందారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు శివయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శివయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, మున్నంగి సుబ్బారెడ్డి, అరెమండ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.